


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 100 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 100 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, FRI 20 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం...

### సజ్జనార్ నుంచి మరో అలర్ట్

- సెర్చ్ ఇంజిన్ ర్యాంకింగులను వాడుకుని పెరిగిపోతున్న సైబర్ మోసాలు
- ప్రభుత్వ, బ్యాంకింగ్ వెబ్‌సైట్లను పోలిన నకిలీ సైట్లతో వినియోగదారులకు వల
- వివరాలు నమోదు చేస్తే ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిక
- యూఆర్ఎల్ సరిచూసుకోవాలని, స్పాన్సర్డ్ లింకులపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- మోసపోతే వెంటనే 1930కి కాల్ చేయాలని ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

- మిగతా 2లో



## విశాఖలో వేడుకగా 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్'

- విశాఖ ఆర్కే బీచ్‌లో ఘనంగా అంతర్జాతీయ సిటీ పరేడ్
- భారత దళాలతో పాటు పలు దేశాల నావికాదళాల కవాతు
- అబ్బురపరిచిన వైమానిక విన్యాసాలు, కమాండోల ప్రదర్శనలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- వివిధ దేశాల సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి

2లో



# ఇది బాబు భజన.. అన్నీ తప్పుడు లెక్కలే

## ఏపీ బడ్జెట్‌పై జగన్ విమర్శలు



- ఏపీ బడ్జెట్ అబద్ధాలు, తప్పుడు లెక్కలమయం అని జగన్ విమర్శ
- సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ప్రభుత్వంపై ఆరోపణ
- రాష్ట్ర ఆదాయం బాబు అండ్ కో జేబుల్లోకి వెళుతోందని ఘాటు వ్యాఖ్యలు
- సొంత ఆదాయాల వృద్ధిలో ఏపీ 22వ స్థానంలో ఉందని వెల్లడి
- నారా లోకేశ్ పైనా తీవ్ర స్థాయిలో జగన్ ధ్వజం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, కేవలం చంద్రబాబు భజన, తప్పుడు లెక్కలతో నిండిన మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. "మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అది చంద్రబాబే. అబద్ధానికి రెక్కలు కడితే అది కూడా చంద్రబాబే" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పాలన "పబ్లిసిటీ పీక్.. పర్ఫామెన్స్ వీక్" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను మూడు బడ్జెట్‌లలోనూ గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక లెక్కలన్నీ తప్పుల తడకలేనని జగన్ అంకెలతో సహా వివరించారు. 2024-25లో రూ.1.19 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, వాస్తవానికి రూ.94,937 కోట్లు మాత్రమే రాబట్టారని తెలిపారు. పది నెలల్లో రాష్ట్ర ఆదాయ వృద్ధి కేవలం 4.25 శాతమేనని పేర్కొన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 23 రాష్ట్రాల్లో సొంత ఆదాయాల పురోగతిలో ఏపీ చివరి నుంచి రెండో స్థానంలో (22వ ర్యాంక్) ఉందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2026-27 నాటికి ఆదాయం 45% పెరుగుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం 'బాబు అండ్ కో' జేబుల్లోకి వెళ్తోందని, "దోచుకో.. దాచుకో.. పంచుకో" అనే విధానం అమలవుతోందని జగన్ ఆరోపించారు. అప్పుల వివరాలను బడ్జెట్‌లో చూపించకపోవడం

- మిగతా 2లో



## కాలేజీలు, స్కూళ్లకు ఏఐని అందుబాటులోకి తీసుకొస్తాం

### కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

- ఏఐ పటంలో భారత్ ను నాయకుడిగా నిటబెట్టడమే లక్ష్యమన్న అశ్విని వైష్ణవ్
- విద్యార్థులకు ఏఐ నాలెడ్జ్ ను తీసుకొస్తామని వెల్లడి
- పాఠశాలలు, కళాశాలలకు ఏఐ సాధనాలు అందుబాటులోకి తీసుకొస్తామన్న కేంద్ర మంత్రి

- మిగతా 2లో

## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు..

## ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!



- ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ఐబీఎం, ఐఐటీ మద్రాస్, ఎన్విడియా వంటి దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు
- 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీలో నైపుణ్య శిక్షణ
- కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్న చంద్రబాబు

- మిగతా 2లో

## ఉచిత పథకాలతో డబ్బు వృథా.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..



- ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు అసహనం.. ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని మండిపాటు!
- అందరికీ ఉచిత విద్యుత్తును ప్రకటించిన స్టాలిన్ ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్ ఎలా ఇస్తారన్న సుప్రీం
- ఉచితాల వల్ల దేశ అభివృద్ధి దెబ్బతింటుందని వ్యాఖ్య


- మిగతా 2లో

# రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి...

## ఏఐ రంగంలో రిలయన్స్ గ్రూప్ సంచలనం

- ఏఐ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టనున్న జియో-రిలయన్స్
- వచ్చే ఏడేళ్లలో ఈ భారీ పెట్టుబడిని పెట్టనున్నట్లు ముకేశ్ అంబానీ వెల్లడి
- గిగావాట్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎడ్జ్ కంప్యూటింగ్‌పై ప్రధాన దృష్టి
- ఏఐ ఉద్యోగాలను సృష్టిస్తుందే తప్ప, తీసేయదని స్పష్టం చేసిన అంబానీ

- మిగతా 2లో



## బొత్స గారూ... మీకు చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియదా?



- మండలిలో హెరిటేజ్‌పై వైసీపీ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి అచ్చెన్నాయుడు
- చీజ్ ప్యాకెట్లు చూపి నెయ్యి అని ప్రచారం చేస్తున్నారని బొత్సపై విమర్శలు
- హెరిటేజ్‌పై ఒక్క ఆధారమైనా చూపాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్
- అసత్య ఆరోపణలపై హెరిటేజ్ ఇప్పటికే లీగల్ నోటీసులు ఇచ్చిందని వెల్లడి
- ప్రతిష్ఠాత్మక సంస్థలపై దాడి చేయడం వైసీపీ ఫ్యాక్షన్ మనస్తత్వానికి నిదర్శనమని వ్యాఖ్య

- మిగతా 2లో

## హిందూపురంలో బాలకృష్ణ పర్యటన.. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

- లేపాక్షి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన బాలకృష్ణ
- మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు బీటీ రోడ్డు పనులకు భూమిపూజ
- రూ.2.60 కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మాణం
- పులమతి చెరువులో హంద్రీనీవా జలాలకు జలహారతి ఇచ్చిన ఎమ్మెల్యే





## పాలు లేకుండా నెయ్యి తీసే టెక్నాలజీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో!

### జగన్‌పై మంత్రి అనిత సెటైర్

- టీటీడీ నెయ్యి సరఫరాపై జగన్ ఆరోపణలకు మంత్రి అనిత కౌంటర్
- హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ
- సాక్షి పేపర్, భారతీ సిమెంట్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తుచేసిన అనిత
- వైవీ సుబ్బారెడ్డి హయాంలోనే నెయ్యి కల్తీ జరిగిందని తీవ్ర ఆరోపణలు
- కల్తీని వదిలేసి హెరిటేజ్‌పై బురద జల్లడమేంటని జగన్‌పై ఫైర్

- మిగతా 2లో

### తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో

# ఎదురు కాల్పులు..

## ఇద్దరు మావోయిస్టులు మృతి

- మావోయిస్టు అగ్రనాయకుల కోసం కర్రెగుట్టల్లో భద్రతా దళాల గాలింపు
- సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు

పెన్ పవర్ డెస్క్:సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో కూంబింగ్ ను కొనసాగి స్తున్నాయి. ఈ క్రమంలో ఈరోజు భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జీ, జూనియర్ క్యాడర్‌కు

- మిగతా 2లో



## చూసిందే నమ్మండి

### హెరిటేజ్ పై నారా భువనేశ్వరి ప్రత్యేక వీడియో




పెన్ పవర్ డెస్క్:హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి తమ సంస్థ నాణ్యతా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## పాలు లేకుండా నెయ్యి తీసే టెక్నాలజీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో!

తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) నెయ్యి సరఫరా అంశంలో వైసీపీ అధినేత జగన్ ఇవాళ మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు సమస్య అయిన కల్తీని పక్కనపెట్టి, సంబంధం లేని హెరిటేజ్ సంస్థపై జగన్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె, జగన్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

**హెరిటేజ్‌కు, ఇందాపూర్‌కు సంబంధమే లేదు**

జగన్ ఆరోపిస్తున్నట్లుగా హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి యాజమాన్య సంబంధం లేదని అనిత స్పష్టం చేశారు. ఇందాపూర్ అనేది బల్క్ మార్కెటింగ్ చేసే సంస్థ అని, అది చీజ్, పన్నీర్, టెట్రాప్యాక్ పాలు వంటి ఉత్పత్తులను తయారు చేసి హెరిటేజ్ వంటి కంపెనీలకు విక్రయిస్తుందని వివరించారు. హెరిటేజ్ సంస్థ నేరుగా వినియోగదారులకు మాత్రమే నెయ్యిని విక్రయిస్తుందని, ఎన్నడూ బల్క్‌గా ట్యాంకర్ల ద్వారా ఇతర కంపెనీలకు సరఫరా చేయలేదని తెలిపారు. “హెరిటేజ్ నుంచి ఇందాపూర్‌కు నెయ్యి వెళ్లి, అక్కడి నుంచి టీటీడీకి వస్తుందని చెప్పడానికి కనీసం బుర్ర పనిచేస్తుందా?” అని ఆమె ఎద్దేవా చేశారు. హెరిటేజ్ సంస్థ తన సిద్ధాంతాల ప్రకారం దేవాలయాలకు బల్క్‌గా సరఫరా చేయదని, ఈ విషయం చిన్నపిల్లవాడిని అడిగినా చెబుతాడని అన్నారు.

**ధరల పెరుగుదలపై చిన్న లాజిక్ మిస్సయ్యారు**

2015లో రూ.280 ఉన్న నెయ్యి ధర, 2026 నాటికి రూ.650కి ఎందుకు పెరిగిందని జగన్ ప్రశ్నించడాన్ని అనిత తప్పుబట్టారు. కాలంతో పాటు ధరలు పెరగడం సహజమని, ఈ చిన్న లాజిక్‌ను జగన్ ఎలా విస్మరించారని ఆమె ప్రశ్నించారు. “మీరు సాక్షి పేపర్ ప్రారంభించినప్పుడు దాని ధర రూ.2, ఇప్పుడు రూ.6.50. భారతీ సిమెంట్ బస్తా ధర రూ.250 నుంచి రూ.450కి పెరిగింది. 2015లో రూ.19 ఉన్న పాల ప్యాకెట్ ఇప్పుడు రూ.40కి చేరింది. పాల ధర పెరిగితే నెయ్యి ధర పెరగదా? బహుశా పాలు లేకుండానే నెయ్యి తయారుచేసే టెక్నాలజీ మీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో” అని ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కర్ణాటకలో పాల ధరలు అధికంగా ఉండటం వల్లే నందిని డైరీ టీటీడీకి రూ.700కు నెయ్యి సరఫరా చేసిందని, ఆ విషయం గురించి జగన్ ఎందుకు మాట్లాడరని నిలదీశారు.

**అసలు దొంగ మీ బాబాయే**

అసలు సమస్య అయిన నెయ్యి కల్తీ గురించి మాట్లాడకుండా, జగన్ సంబంధం లేని హెరిటేజ్ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని అనిత ఆరోపించారు. నెయ్యి కల్తీ జగన్ ప్రభుత్వ హయాంలో, ఆయన బాబాయి వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడే జరిగిందని అనిత తీవ్ర ఆరోపణలు చేశారు. “నెయ్యిలో రసాయనాలు కలిశాయని సిట్, ఎన్డీబీ రిపోర్టులు స్పష్టంగా తేల్చాయి. కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా అప్పటి మీ ప్రభుత్వం ఆ కంపెనీ టెండర్‌ను ఎందుకు రద్దు చేయలేదు? ఎందుకు ఆ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టలేదు?” అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కల్తీ జరిగిందని చార్జ్‌షీట్‌లో ఉన్నా, మీ బాబాయి స్వయంగా అంగీకరించినా దాని గురించి మాట్లాడకుండా, ముక్కు ఎక్కడ ఉందంటే చుట్టూ తిప్పి చూపినట్లు హెరిటేజ్ గురించి ఎందుకు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

**టెండర్ నిబంధనలు మార్చిందెవరు?**

కేవలం తమకు నచ్చిన కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే జగన్ ప్రభుత్వం టెండర్ నిబంధనలను నీరుగార్చిందని అనిత ఆరోపించారు. “ఒక చుక్క పాలు కూడా సేకరించని కంపెనీలు కూడా నెయ్యి సరఫరా చేసేలా నిబంధనలను మార్చారు. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తగ్గించారు. ఇవన్నీ ఎవరికోసం చేశారు? కల్తీపై చర్చకు మేము సిద్ధం. ఆధారాలు చూపించమన్నందుకే ప్రజలకు ఈ వాస్తవాలు వివరిస్తున్నాం. దమ్ముంటే కల్తీ గురించి మాట్లాడండి” అని జగన్‌కు ఆమె సవాల్ విసిరారు.

## రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి...

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో కలిసి భారీ అడుగు వేయనున్నాయి. రాబోయే ఏడేళ్లలో ఈ రంగంలో రూ.10 లక్షల కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ గురువారం ప్రకటించారు. ‘ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్’లో ప్రసంగించిన ఆయన, ఈ పెట్టుబడి కేవలం లాభాల కోసం కాదని, దేశ నిర్మాణం కోసం దశాబ్దాల పాటు ఆర్థిక విలువను సృష్టించే మూలధనమని స్పష్టం చేశారు.ప్రస్తుతం ఏఐ రంగంలో అతిపెద్ద సమస్య కంప్యూటింగ్ వనరుల కొరత, అధిక ఖర్చు అని అంబానీ అన్నారు. ఈ సవాలును అధిగమించేందుకు ‘జియో ఇంటెలిజెన్స్’ ద్వారా మూడు కీలక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జామ్‌నగర్‌లో గిగావాట్-స్థాయి ఏఐ-రెడీ డేటా సెంటర్ల నిర్మాణం ప్రారంభించామని, 2026 ద్వితీయార్థంలో 120 మెగావాట్ల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.ండోది, తమకున్న గ్రీన్ ఎనర్జీ సామర్థ్యమని, ఆంధ్రప్రదేశ్, కచ్‌లలోని సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి 10 గిగావాట్ల గ్రీన్ పవర్ సిద్ధంగా ఉందని వివరించారు. మూడోది, దేశవ్యాప్తంగా ఎడ్జ్ కంప్యూటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం. దీని ద్వారా సామాన్యులకు సైతం తక్కువ ఖర్చుతో, వేగవంతమైన ఏఐ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

అన్ని భారతీయ భాషల్లో ప్రపంచస్థాయి ఏఐ సామర్థ్యాన్ని సాధించడం తమ లక్ష్యమని, ఇది సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఏఐ ఉద్యోగాలను తీసివేయదని, కొత్తగా నైపుణ్యం గల ఉద్యోగాలను సృష్టిస్తుందని అంబానీ భరోసా ఇచ్చారు. దేశంలోని స్టార్టప్‌లు, ఐఐటీలు, పరిశోధన సంస్థలతో పాటు ప్రపంచంలోని అగ్రశ్రేణి టెక్ కంపెనీలతో కలిసి పనిచేస్తామని, ఏఐ శతాబ్దానికి భారత్‌ను సహ-నిర్మాతగా నిలుపుతామని ఆయన వెల్లడించారు.

## చూసిందే నమ్మండి

- మొదటి పేజి తరువాయి

ప్రమాణా లపై వినియోగదారులకు భరోసా ఇస్తూ ‘హెరిటేజ్ ప్రామిస్’ పేరుతో ఒక వీడియోను విడుదల చేశారు. ‘చూసిందే నమ్మండి’ అనే నినాదంతో విడుదలైన ఈ వీడియోలో కంపెనీ పనితీరు, రైతుల పట్ల అనుసరిస్తున్న విధానాలను ఆమె వివరించారు.గత 33 ఏళ్లుగా ప్రతి ఇంటికి తాజా, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తులు అందించడమే లక్ష్యంగా హెరిటేజ్ పనిచేస్తోందని భువనేశ్వరి తెలిపారు. రూ.4 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన సంస్థ, నేడు రూ.4,000 కోట్ల స్థాయికి ఎదిగినా నాణ్యత విషయంలో ఎన్నడూ రాజీ పడలేదని ఆమె స్పష్టం చేశారు. వినియోగదారుల ఇంటికి చేరే ప్రతి ఉత్పత్తి 25 కఠినమైన నాణ్యతా పరీక్షలు దాటిన తర్వాతే వస్తుందని, 500 మందికి పైగా నిపుణులు ఈ ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తారని ఆమె పేర్కొన్నారు.

తొమ్మిది రాష్ట్రాల్లోని సుమారు 3 లక్షల మంది పాడి రైతులతో తమ సంస్థ కలిసి పనిచేస్తోందని భువనేశ్వరి వివరించారు. పారదర్శకత, న్యాయమైన ధర, సకాలంలో చెల్లింపులు అనే సూత్రాలతో రైతులకు సాధికారత కల్పిస్తున్నామని అన్నారు. ఈ వీడియోను పూర్తిగా చూసి, వాస్తవాలను స్వయంగా తెలుసుకోవాలని ఆమె ప్రజలను కోరారు.

# ఇది బాబు భజన..అన్నీ తప్పుడు లెక్కలే

- మొదటి పేజి తరువాయి

పారదర్శకత లేకపోవడానికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు నిధుల కేటాయింపు ఏదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల డబ్బుతో కొలంబో, ఢిల్లీ అంటూ విమానాల్లో తిరుగుతూ క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ, స్టేడియాల్లో జల్సాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. “రాత్రికి కొలంబోలో ఉంటాడు, మరుసటి రోజు ఉదయం విజయవాడలో ఉంటాడు... సాయంత్రానికి ఢిల్లీ వెళతాడు... అంతా ప్రైవేటు విమానాలే. దేశంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలా జల్సాలు చేయడం ఎక్కడైనా ఉందా? చంద్రబాబుకు ఒక విమానం, లోకేశ్ కు ఒక విమానం, పవన్ కల్యాణ్ కు ఓ విమానం... అందరూ గాల్లోనే ఉంటారు. క్రికెట్ మ్యాచ్ చూడాలంటే కొలంబోనే వెళ్లాలా... టీవీలో చూస్తే కనపడదా... నేను కూడా టీవీలోనే చూశాను” అంటూ జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

## విశాఖలో వేడుకగా ‘ఇంటర్నేషనల్ సిటీ పరేడ్’

‘సిటీ ఆఫ్ డెస్టినీ’ విశాఖపట్నం సాగర తీరం గురువారం సాయంత్రం అద్భుత ప్రదర్శనలకు వేదికైంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (×ఫీ=), మిలన్ 2026 వేడుకల్లో భాగంగా ఆర్కే బీచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ నగర పరేడ్ కన్నుల పండువగా సాగింది. భారత నావికాదళ శక్తి సామర్థ్యాలు, వివిధ దేశాల సాంస్కృతిక వైభవానికి ఈ పరేడ్ దర్పణం పట్టింది.

ఈ భారీ పరేడ్‌లో భాగంగా తొలుత భారత నావికాదళ విమానాలు, హెలికాప్టర్లు గగనతలంలో అబ్బురపరిచే విన్యాసాలు చేశాయి. అనంతరం భారత త్రివిధ దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్), కోస్ట్ గార్డ్ కంటింజెంట్లు కవాతు నిర్వహించాయి. వీరితో పాటు ఫ్రాన్స్, రష్యా, వియత్నాం, థాయ్‌లాండ్, శ్రీలంక సహా పలు మిత్ర దేశాల నావికాదళ సిబ్బంది, వారి సెరిమోనియల్ బ్యాండ్‌లు ప్రదర్శనలో పాల్గొని ఆకట్టుకున్నాయి.ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. నేవీ కమాండోలు ప్రదర్శించిన సాహస కృత్యాలు, డ్రోన్, లేజర్ షోలు,

చివరిలో బాణసంచా వెలుగులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వివిధ దేశాల కళాకారులు వారి సంప్రదాయ నృత్యాలతో అలరించారు.భారత నౌకాదళ శక్తిని ప్రపంచానికి చాటడంతో పాటు, మిత్ర దేశాలతో సముద్ర భద్రతలో సహకారాన్ని, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పరేడ్‌ను నిర్వహించారు. ఈ అంతర్జాతీయ వేడుకకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఆర్కే బీచ్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. నిర్వాహకులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం...

సాంకేతికత పెరిగాక ఏ చిన్న సమాచారం కావాలన్నా వెంటనే గూగుల్ వంటి సెర్చ్ ఇంజిన్లను ఆశ్రయించడం సాధారణమైంది. అయితే, మనకున్న ఈ అలవాటే ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు ఆయుధంగా మారింది. సెర్చ్ ఫలితాల్లో అగ్రస్థానంలో కనిపించినంత మాత్రాన అది అసలైన, సురక్షితమైన వెబ్‌సైట్ అని గుడ్డిగా నమ్మితే నిలువునా మోసపోయే ప్రమాదం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని ఆయన సూచించారు.

**మోసగాళ్ల కొత్త ఎత్తుగడ ఇదే**

సైబర్ మోసగాళ్లు ఇప్పుడు ‘సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్’ (ఎస్ఈవో) అనే అధునాతన టెక్నిక్‌ను, పెయిడ్ ప్రకటనలను వాడుకుంటున్నారు. బ్యాంకులు, ప్రభుత్వ పోర్టల్స్, ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల పేర్లతో అచ్చుగుద్దినట్టు ఉండే నకిలీ ‘ఫిషింగ్’ వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. వినియోగదారులు కస్టమర్ కేర్ నంబర్లు, ప్రభుత్వ పథకాలు లేదా ఇతర సేవల కోసం వెతికినప్పుడు, ఈ నకిలీ సైట్లు సెర్చ్ ఫలితాల్లో టాప్‌లో కనిపించేలా చేస్తున్నారు. వీటిపై ‘హజూశీఅంశీతీవసు’ లేదా ‘ూాం’ అని చిన్న అక్షరాలతో ఉంటుంది. వాటిని గమనించకుండా నిజమైన వెబ్‌సైట్ అని భ్రమపడి క్లిక్ చేయగానే మోసం మొదలవుతుంది.వెబ్‌సైట్ ఓపెన్ అయిన వెంటనే వ్యక్తిగత వివరాలు, లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్/డెబిట్ కార్డు నంబర్లు, సీవీవీ, ఓటీపీ వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని నమోదు చేయమని కోరతారు. ఆ వివరాలు వారికి చిక్కగానే క్షణాల్లో మీ బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తారు. కేవలం ఆర్థికంగా నష్టపరచడమే కాకుండా, మీ గుర్తింపు పత్రాలను దొంగిలించి ‘ఐడెంటిటీ థెఫ్ట్’కు పాల్పడే ప్రమాదం కూడా ఉంది. అంటే మీ పేరు మీద రుణాలు తీసుకోవడం లేదా ఇతర నేరాలకు పాల్పడటం వంటివి చేయవచ్చు.

**రక్షణ కవచం అప్రమత్తతే**

ఈ తరహా మోసాల బారిన పడకుండా ఉండేందుకు పోలీసులు కొన్ని కీలక సూచనలు జారీ చేశారు.

ఏదైనా వెబ్‌సైట్‌ను సందర్శించే ముందు దాని చిరునామా (ఖ=ూ)ను క్షుణ్ణంగా పరిశీలించాలి. అసలు వెబ్‌సైట్ స్పెల్లింగ్‌కు, నకిలీ వెబ్‌సైట్ స్పెల్లింగ్‌కు చిన్న తేడాలుంటాయి.

వీలైనంత వరకు సెర్చ్ ఇంజిన్లలో వెతకడం కన్నా, మీకు తెలిసిన అధికారిక వెబ్‌సైట్ చిరునామాను నేరుగా బ్రౌజర్ అడ్రస్ బార్‌లో టైప్ చేసి ఓపెన్ చేయడమే సురక్షితం.

సెర్చ్ ఫలితాల్లో Sponsored లేదా Ad అని కనిపించే లింకులపై క్లిక్ చేసేటప్పుడు రెట్టింపు జాగ్రత్త అవసరం.

ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలి లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. ఆన్‌లైన్ ప్రపంచంలో మన అప్రమత్తతే మనకు రక్షణ కవచమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

## కాలేజీలు, స్కూళ్లకు ఏఐని అందుబాటులోకి తీసుకొస్తాం

ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ భారత్ భవిష్యత్ ఏఐ ప్లాన్‌ను స్పష్టంగా వివరించారు. దేశాన్ని ప్రపంచ ఏఐ పటంలో నాయకుడిగా నిలబెట్టడమే లక్ష్యంగా పాఠశాల, కాలేజీ స్థాయి సిలబస్‌ను పూర్తిగా మారుస్తున్నామని ప్రకటించారు.విద్యార్థులకు ఏఐ నాలెడ్జ్ ను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి అన్నారు. పాఠశాలలు, కళాశాలలకు ఏఐ సాధనాలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. విద్యార్థులు కేవలం సాంకేతికతను నేర్చుకోవడమే కాకుండా, సమస్యలకు కొత్త పరిష్కారాలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. “దేశంలో ప్రతిభకు కొరత లేదు. యువత భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటే... భారత్ ప్రపంచ ఏఐ పటంలో అగ్రస్థానంలో నిలుస్తుంది” అని అన్నారు. సెమీకండక్టర్, టెలికాం రంగాల్లో సాధించిన విజయాల తరహాలోనే ఏఐ మిషన్‌ను వేగవంతం చేస్తామని మంత్రి అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ వంటి సంస్థలు పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని ప్రశంసించారు.

## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు.. ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!

ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కీలక పర్యటన చేపట్టనున్నారు. రేపు (ఫిబ్రవరి 20) ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న ‘ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026’లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి, యువతకు నైపుణ్య శిక్షణకు మార్గం సుగమం చేసేలా పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకోనున్నారు.ఈ సదస్సులో భాగంగా ఏపీ ప్రభుత్వం పలు చరిత్రాత్మక ఒప్పందాలకు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్ సాంకేతికతల్లో నైపుణ్యాలు కల్పించేందుకు దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. అలాగే, ఏఐ, క్వాంటం టెక్నాలజీలలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు యూనిసీసీ సంస్థతో కలిసి ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ సంస్థతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకోనుంది. ప్రముఖ టెక్ సంస్థ ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై కూడా ఈ సదస్సులో కీలక ప్రకటన చేయనున్నారు.రేపు ఉదయం 9:30 గంటలకు జరిగే ప్లీనరీ సెషన్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో

కలిసి చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, డబ్ల్యూఈఎఫ్ సీఈఓ బోర్గే బ్రెండేతో కలిసి కృత్రిమ మేధస్సు అంశంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతినిధి బృందంతో పాటు అరామ్కో, అడోబ్, ఆటోడెస్క్ వంటి కంపెనీల అధిపతులతోనూ ముఖ్యమంత్రి విడివిడిగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చలు జరుపుతారు.

**ఈ సాయంత్రం జైపూర్ కు!**

కాగా, ఢిల్లీ పర్యటనకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు సాయంత్రం జైపూర్ వెళ్లనున్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహ వేడుకకు హాజరై, రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం జైపూర్ నుంచి నేరుగా ఢిల్లీకి చేరుకొని ఏఐ సదస్సులో పాల్గొంటారు.

## తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో ఎదురు కాల్పులు.. ఇద్దరు మావోయిస్టులు మృతి

- మొదటి పేజి తరువాయి

చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జ్ కేసా సోఢీ ఈ ప్రాంతంలో ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. సుమారు రెండు వేల మంది జవాన్లు కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో రెండు రోజులుగా జల్లెడ పడుతుండగా బలగాలకు మావోయిస్టులు తారసపడ్డాయి. ఈ క్రమంలో మావోయిస్టులు కాల్పులు జరపగా, పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు.2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. సీఆర్పీఎఫ్, కోబ్రా, డీఆర్జీ, సీఏఎఫ్ సంయుక్త బలగాలు గత ఏడాది ఏప్రిల్ నెలలో 21 రోజుల పాటు కర్రెగుట్టలో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. అయితే అప్పుడు మావోయిస్టు పార్టీ సీనియర్ క్యాడర్ తప్పించుకుంది. వారి కోసం భద్రతా బలగాలు జల్లెడపడుతున్నాయి.

## హిందూపురంలో బాలకృష్ణ పర్యటన.. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గురువారం లేపాక్షి మండలంలో పర్యటించిన ఆయన, రెండు కీలకమైన బీటీ రహదారుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.వివరాల్లోకి వెళ్తే, మండలంలోని మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు రూ.2.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ రహదారి పూర్తయితే స్థానిక గ్రామస్తులకు రవాణా కష్టాలు తీరుతాయని తెలిపారు. అనంతరం ఆయన పులమతి చెరువు వద్దకు చేరుకుని, హంద్రీనీవా జలాలకు ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చారు.ఇదే పర్యటనలో భాగంగా కొత్తపల్లి నుంచి నాగేపల్లి వరకు నిర్మించనున్న మరో రహదారి పనులకు కూడా బాలకృష్ణ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లాలో రవాణా, సాగునీటి రంగాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా బాలకృష్ణ స్పష్టం చేశారు.

## ఉచిత పథకాలతో డబ్బు వృధా.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకమవుతాయని సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్తు ఇవ్వడం కన్నా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి సారించాలని సూచించింది. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వ ఉచిత విద్యుత్తు ప్రకటనపై సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వంపై దాఖలైన పిటిషన్ ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్తును ఎలా అందిస్తారని ప్రశ్నించింది.చాలా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరుగుతోందని... అయినప్పటికే ఉచిత పథకాల పంపిణీ జరుగుతోందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి ఉచిత పథకాల వల్ల దేశ అభివృద్ధికి విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. సంక్షేమ పథకాల్లో భాగంగా కరెంట్ బిల్లులు చెల్లించలేని వారికి ఉచిత విద్యుత్ అందిస్తామంటే ఒక అర్థం ఉంటుందని... కానీ, మీరు ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఆహారం, విద్యుత్ ఇలా అన్నీ ఫ్రీగా ఇస్తూ... మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని ప్రశ్నించింది. ఎన్నికలకు ముందే రాష్ట్రాలు ఇలాంటి ఉచిత పథకాలను ఎందుకు తీసుకొస్తున్నాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల సమయంలో అన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే... అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా కూడా మిగలదని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## బొత్స గారూ... మీకు చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియదా?

హెరిటేజ్ సంస్థపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. చీజ్ ప్యాకెట్లు చేతిలో పట్టుకుని, వాటిని నెయ్యి అని చూపిస్తూ ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, వైసీపీ నేతలకు కనీస అవగాహన ఉందా అని శాసనమండలిలో నిలదీశారు. మండలిలో వైసీపీ సభ్యుల తీరు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన విమర్శించారు.ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని గత రెండు రోజులుగా తాను స్పష్టంగా సమాధానం ఇస్తున్నప్పటికీ, అదే అంశాన్ని పట్టుకుని సభా సమయాన్ని వృథా చేయడం దుర్మార్గమని అచ్చెన్నాయుడు అన్నారు. ముఖ్యంగా మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణను ఉద్దేశించి, “చీజ్ ప్యాకెట్లను చూపిస్తూ నెయ్యి ప్యాకెట్లు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. మీకు చీజ్‌కు, నెయ్యికి మధ్య తేడా కూడా తెలియదా?” అని ఎద్దేవా చేశారు. హెరిటేజ్‌పై అంతగా అనుమానాలు ఉంటే ఒక్కటంటే ఒక్క చిన్న ఆధారాన్నైనా సభ ముందు పెట్టాలని, లేనిపక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ అసత్య ప్రచారాలపై హెరిటేజ్ సంస్థ ఇప్పటికే వైసీపీ నేతలకు లీగల్ నోటీసులు పంపిందని, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. “గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలతో పచ్చని తోటలు నరికించినట్లు, ఇప్పుడు ప్రతిష్ఠాత్మక సంస్థల ఆర్థిక మూలాలపై దాడి చేయాలని చూడటం మీ ఫ్యాక్షన్ మనస్తత్వానికి నిదర్శనం” అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని భారతి సిమెంట్ పేరుతో ప్రభుత్వ ధనాన్ని దోచుకున్న చరిత్ర వైసీపీదని, కానీ హెరిటేజ్ సంస్థ ప్రభుత్వాలతో సంబంధం లేకుండా పారదర్శకంగా వ్యాపారం చేయాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సంస్థ అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నిత్యం వాయిదా తీర్మానాలతో సభను పక్కదారి పట్టించడం మానేసి, దమ్ముంటే ఆధారాలతో మాట్లాడాలని, నిర్మాణాత్మక చర్చకు రావాలని వైసీపీకి ఆయన సవాల్ విసిరారు.

## కాపులూరు ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణం...

నాయుడుపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 19
నాయుడుపేట మండలంలోని కాపులూరు ఎస్టీ కాలనీలో సులూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కాపులూరు చక్రపాణి సుమారు పది లక్షల రూపాయల వ్యయం తో సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. గత అనేక ఏళ్లుగా కాపులూరు ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు లేకపోవడంతో చిరుజల్లులకే వీధి రోడ్లు బురదమయంగా తయారై తాము ఇబ్బందులు పడేవారమని కాలనీవాసులు తెలియజేశారు. తమ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తోపాటు సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించిన స్థానిక టిడిపి నేతకాపులూరు చక్రపాణి కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.



పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।



## మా ఆస్తులపై మాట్లాడే అర్హత మీకు లేదు !


పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 19,
మా తల్లిదండ్రుల ద్వారా వచ్చిన ఆస్తులపై మాట్లాడే అర్హత మీకు లేదని, అధికారం ఉండి ప్రజల కెవరేమి చేశారో తేల్చుకుందామని టీడీపీ నాయకులు విమర్శించారు.గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రెండు రోజుల క్రితం వైకాపా నాయకులు చేసిన నిరాధారమైన ఆరోపణలను ఖండిస్తూ వివరణ ఇచ్చారు. అవినీతి అక్రమాలపై వైకాపా నాయకులు చేస్తున్న విమర్శలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయన్నారు. గంగవరం మాజీ సర్పంచ్ మురళీ మాట్లాడుతూ.. గంగవరం మండల కేంద్రంలో తమ తల్లిదండ్రుల ద్వారా సంక్రమించిన ఆస్తులపై ఏమైనా గొడవలు ఉంటే మా కుటుంబ సభ్యులు మాట్లాడు కొంటామని, దీనిపై ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు మాట్లాడడం మానుకొంటే చాలా మంచిదని,ఏమైనా మాట్లాడాలని అనుకొంటే గతంలో నేను పంచాయతీ సర్పంచ్ గా ఉండి ఏమి అభివృద్ధి చేశానో, ఇప్పుడు అధికారంలో ఉన్న సర్పంచ్ తనయుడు పంచాయతీలో చేసిన అభివృద్ధి పనులపై చర్చిద్దామని ఆయన సవాలు విసిరారు. తమపై చేసిన అవాస్తవమైన ఆరోపణలు పూర్తిగా నిజం కాదని ఆయన వివరించారు. బైరెడ్డిపల్లె సింగిల్ విండో చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ..ఎమ్మెల్యే అమరనాథ్ హయాంలో నియోజకవర్గ స్థాయిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఇకనైనా వైసీపీ నాయకులు అవాస్తవాలను కట్టిపెట్టాలని లేకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అభివృద్ధిలో పోటీ పడాలే గానీ అబద్దాలతో ప్రజలను మభ్య పెట్టాలని చూడడం తగదని హితవు పలికారు.ఈ మీడియా సమావేశంలో పలమనేరు పట్టణ పార్టీ అధ్యక్షులు ఆర్బిసి కుట్టి,గంగవరం, కొత్తపల్లి టీడీపీ నాయకులు మునస్వామి లు ప్రశంగించారు.ఈ మీడియా సమావేశంలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, గంగవరం మండలం నాయకులు సోమశేఖర్ గౌడ్,ప్రతాపరెడ్డి, రాము,రవి,అశోక్, కిరణ్ లతో పాటు పట్టణ నాయకులు గిరి, నాగరాజు,బిఆర్సి కుమార్,మదన్, శ్రీధర్,సుబ్బు,నదీమ్,సుబ్రహ్మణ్యం,వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు మజ్జిగ సేవ:

### - ముందడుగు వేసిన ఏపీ గ్రామీణ బ్యాంక్
### -ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సేవా కార్యక్రమం



శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి,19 :
శ్రీకాళహస్తీశ్వరుని శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుని పుణ్యక్షేత్రం యొక్క కైలాస గిరిప్రదక్షిణ సందర్భంగా భక్తుల సేవార్థం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎన్ కామేశ్వరరావు ఆదేశాల మేరకు పట్టణంలో గల శ్రీకాళహస్తి, పానగల్, తొట్టంబేడు బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించబడింది. భక్తులకు ఉచితంగా 10,000 చల్లని మజ్జిగ పాకెట్స్ ను, 5,000 వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేస్తూ సిబ్బంది సేవచేసారు.ఉదయం నుంచే భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల, గిరిప్రదక్షిణ మార్గంలో ఈ సేవ భక్తులకు ఎంతో ఉపశమనం కలిగించింది.వేడిలో నడిచే భక్తులకు దాహార్తి నివారణ కోసం మజ్జిగ పంపిణీ చేయడం పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాలు తమ సంస్థ యొక్క సమాజశీ పట్ల ఉన్న బాధ్యతలో భాగమని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్లు ఎం.వి. రమణయ్య, ప్రతాప్ కుమార్,బి.నరేష్ అసిస్టెంట్ మేనేజర్లు అశోక్ గాంధీ, పవన్,సోనిక బ్యాంకు సిబ్బంది శ్రీనివాస ప్రసాద్, రమేష్,అప్రైజర్ కదూరు నాగరాజు పాల్గొన్నారు.




## శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవము అత్యంత వైభోగంగా నిర్వహించారు

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 19.
బుచ్చిరెడ్డిపాలెం రామకృష్ణ నగర్ లో వెలసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు దశమ వార్షిక సందర్భంగా గురువారం నాడు ఉభయకర్తలు రామిశెట్టి కళ్యాణ్ కుమార్ ధర్మపత్ని ఝాన్సీ లక్ష్మి కొంజేటి వెంకట శేషయ్య ధర్మపత్ని రాజ్యలక్ష్మి స్వామివారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా వేద మంత్రాల మధ్య, మంగళ వాయిద్యాల మోతతో భక్తి శ్రద్ధలతో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ వేడుకను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం మొత్తం గోవింద నామస్మరణతో మారుమోగిపోయింది. అన్నదానం కార్యక్రమ భారీ ఎత్తున నిర్వహించారు పది సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల పూలతో మరియు విద్యుత్ దీపాలతో ఎంతో అందంగా అలంకరించారు. కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ఆశీస్సులు లభించాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాలు మరియు అభిషేకాలు భక్తులకు కనువిందు చేశాయి. అన్నదానం మరియు ఇతర సేవా కార్యక్రమాలు ఎంతో క్రమశిక్షణతో జరిగాయి. నెల్లూరు జిల్లాలో బుచ్చిరెడ్డిపాలెం రామకృష్ణ నగర్ ఆలయం ఒక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది.

## ఆప్కో చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ ను సందర్శించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



కోవూరు పెన్ పవర్ ఫిబ్రవరి 19.
రాష్ట్రంలో చేనేత వస్త్రాలకు ప్రాచుర్యం కల్పించే దిశగా అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన 12 స్టాళ్లను కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సందర్శించారు. గురువారం స్పీకర్ అయ్యన్నపాత్రులు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తదితరులు, ఇతర ఎమ్మెల్యేలతో కలిసి స్టాళ్లను సందర్శించిన ఆమె.. ఈ సందర్భంగా వస్త్రాలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేసి వస్త్రాలు కొనుగోలు చేశారు. చేనేత వస్త్రాలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాచుర్యం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడం ద్వారా, నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ప్రజలంతా వారంలో ఒకరోజు చేనేత దుస్తులు ధరించడం ద్వారా సంప్రదాయమైన చేనేత వృత్తికి వెన్నుదన్నుగా నిలిచేవారవుతారని చెప్పారు



## అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టుకు మీడియా ప్రతినిధుల చేయూత

గూడూరు, పెన్ పవర్,ఫిబ్రవరి 19: ఓజిలి మండలం చిలమానుచేను గ్రామానికి చెందిన తలారి నాగరాజు గూడూరులో ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిగా పనిచేస్తున్నారు. ఇటీవల మధుమేహం తీవ్రంగా పెరగడంతో ఆయన కిడ్నీలు దెబ్బతిన్నాయి. అదనంగా కంటి చూపు కూడా తగ్గిపోవడంతో ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నిరుపేద కుటుంబానికి చెందిన నాగరాజు సరైన వైద్యం పొందలేని పరిస్థితి నెలకొంది.ఈ విషయం తెలుసుకున్న గూడూరు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు స్పందించి దాతల సహకారంతో ఆర్థిక సహాయం సమీకరించారు. రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు రాజనేని శ్రీనివాసులు నాయుడు రూ.15,000లు, అలాగే పెన్వర్ కంపెనీ డైరెక్టర్ గంటా మధు కృష్ణ రూ.15,000లు అందజేశారు. మొత్తంగా రూ.30,000లను గురువారం చిలమానుచేను గ్రామంలో నాగరాజు కుటుంబ సభ్యులకు అందించారు.అదనంగా మరికొంతమంది దాతలు ఫోన్ ట్రాన్సాక్షన్ ద్వారా తమవంతు సహాయం అందించినట్లు తెలిపారు. నాగరాజు ఆరోగ్యం మెరుగుపడేందుకు మరింత ఆర్థిక సహాయం అవసరమైందని, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆల్తాఫ్, అనీల్, రఘు, సతీష్, మస్తాన్ తదితరులు విజ్ఞప్తి చేశారు

## మైనారిటీ సంక్షేమంపై ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రత్యేక దృష్టి



గూడూరు, పెన్ పవర్,ఫిబ్రవరి,19:
అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మైనారిటీ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూక్ ను గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వాకాడు మండలంలోని వాకాడు షాదీ మంజిల్‌లో డైనింగ్ హాల్, కిచెన్ రూమ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే కోట మండలం చంద్రశేఖరపురంలో ఉన్న ముస్లిం స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్, సీసీ రోడ్డు మంజూరు చేయాలని అభ్యర్థించారు.అదేవిధంగా గూడూరు పట్టణ పరిధిలో క్రైస్తవ సోదరులు పలు కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఫంక్షన్ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని, గాంధీనగర్‌లోని క్రిస్టియన్ స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని పలు చర్చిల మరమ్మత్తులకు కూడా ఆర్థిక సహాయం అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ వినతులపై మంత్రి మహమ్మద్ ఫరూక్ సానుకూలంగా స్పందించి, అవసరమైన అనుమతులు త్వరలోనే మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ తెలిపారు.

## గిరి ప్రదక్షిణలో ట్రాఫిక్ జామ్ భక్తులకు తీవ్ర ఇబ్బందులు

శ్రీకాళహస్తి , పెన్ పవర్, ఫిబ్రవరి, 19 :
శ్రీకాళహస్తీశ్వర ఆలయం పరిసరాల్లో గిరి ప్రదక్షిణ ఆలస్యంగా ప్రారంభం కావడంతో దేవుడు బాటలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఒంటి గంట తర్వాత ప్రారంభమైన ఊరేగింపుతో దాదాపు రెండు గంటలపాటు వాహనాలు అక్కడికక్కడే ఆగిపోయాయి. వాహనదారుల రద్దీ కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వచ్చే ఏడాది గిరి ప్రదక్షిణ సందర్భంగా ఆ ఒక్కరోజు అయినా వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించాలని భక్తులు కోరుతున్నారు



# రైతన్నకు అండగా ఎన్డీయే ప్రభుత్వం

## -బీమాల భాస్కర్, చిల్లకూరు మణి ప్రశంసలు



తొట్టంబేడు , పెన్ పవర్, ఫిబ్రవరి 19 :
గత వైసిపి ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొన్న చేదు అనుభవాలు పునరావృతం కాకుండా చూడాలని, రైతన్నకు అండగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడుతోందని తంగేళ్లపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, తెలుగుదేశం పార్టీ తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి పేర్కొన్నారు.రైతును రాజుగా నిలబెట్టే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "రైతన్నా మీకోసం" కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచ సూత్రాలైన (1) నీటి భద్రత, (2) డిమాండ్ ఆధారిత పంటలు, (3) అగ్రిటెక్, (4) ఫుడ్ ప్రాసెసింగ్, (5) ప్రభుత్వ మద్దతు అంశాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు.వ్యవసాయం మరియు అనుబంధ రంగాల అభివృద్ధి కోసం 2026-27 బడ్జెట్‌లో రూ.13,598 కోట్లను కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే "అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్" పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20,000 చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. 2025-26 రెండో విడత వరకు 46.86 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.6,309.44 కోట్లను చెల్లించగా, 2026-27 సంవత్సరానికి రూ.6,600 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించినట్లు వివరించారు.గత ప్రభుత్వ కాలంలో బకాయి పడిన ధాన్యం సేకరణకు సంబంధించిన రూ.1,674.47 కోట్ల పాత బకాయిలను చెల్లించి రైతులను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిదేనని కొనియాడారు. 2025-26 సీజన్‌లో 51 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పూర్తి చేసి రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు.ధరల స్థిరీకరణ కోసం గత బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించినప్పటికీ, అవసరాన్ని బట్టి రూ.588 కోట్ల వరకు ఖర్చుచేసి సుమారు లక్ష మంది రైతులను ఆదుకున్నట్లు తెలిపారు. ఇందులో తోతాపూరి మామిడి రైతులకు రూ.190 కోట్లు, కడప, కర్నూలు జిల్లాల ఉల్లి రైతుల నుంచి కొనుగోళ్లకు రూ.17.56 కోట్లు, ఉల్లి పంట నష్టపరిహారాన్ని హెక్టారుకు రూ.25 వేల నుంచి రూ.50 వేలకు పెంచి రూ.128.33 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. అదేవిధంగా పొగాకు రైతులకు రూ.240 కోట్లు, కోకో రైతులకు రూ.12 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు



# గరికపాటి చంద్రమోహన్‌కి ఆర్థిక సాయం

## - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 19.
దామరమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని అరుంధతి వాడ ప్రాంతానికి చెందిన తెలుగుదేశం పార్టీ నిబద్ధత గల కార్యకర్త గరికపాటి చంద్రమోహన్ ఇటీవల ఎడమ కాలి శస్త్రచికిత్స (లెఫ్ట్ లెగ్ సర్జరీ ) కోసం నెల్లూరు (నెల్లూరు హాస్పిటల్ ) లో చికిత్స పొందిన విషయం తెలిసి, శ్రీ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాలతో పార్టీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి బెజవాడ జగదీష్ పీతల చిన్నా శేషయ్య కలిసి ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా నాయకులు చంద్రమోహన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆయన వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించి తమ సహృదయతను చాటుకున్నారు.
ప్రత్యేకంగా, కార్యకర్త కష్టకాలంలో ఆర్థికంగా అండగా నిలవడం ద్వారా శ్రీ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తన నాయకత్వం సేవామూర్తి స్వభావాన్ని మరోసారి నిరూపించారు. వైద్య ఖర్చుల భారం కార్యకర్త కుటుంబంపై పడకుండా తక్షణ ఆర్థిక సహాయం అందించడం ఆమె కార్యకర్తల పట్ల ఉన్న బాధ్యతా భావానికి నిదర్శనంగా నిలిచింది. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్త వెనుక పార్టీ నిలుస్తుందనే నమ్మకాన్ని ఈ సహాయం మరింత బలపరిచింది.కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అన్న నమ్మకంతో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ తన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుతూ వారి బాగోగులు చూసుకుంటుందని నాయకులు పేర్కొన్నారు. కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలబడటం తెలుగుదేశం పార్టీ సంప్రదాయం అని, ప్రతి కార్యకర్తకు పార్టీ కుటుంబంలాంటిదని వారు స్పష్టం చేశారు.శ్రీ గరికపాటి చంద్రమోహన్ త్వరగా కోలుకుని మళ్లీ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు

# జాతీయ స్థాయి యుద్ధ కళల పోటీలో ఆత్మకూరు విద్యార్థికి స్వర్ణ పతకం

## విజేతను ఘనంగా సన్మానించిన బీజేపీ పట్టణ అధ్యక్షులు నున్న సంతోష్ కుమార్







ఆత్మకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 19.
ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఇటీవల నిర్వహించిన 'పెన్కాక్ సిలాట్' (పెంక్యాక్ శిలాట్ ) నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ఆత్మకూరుకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయిలో మెరిశాడు. పట్టణంలోని జె.ఆర్. పేట ప్రాంతానికి చెందిన సయ్యద్ జమీర్ కుమారుడు, ఏడవ తరగతి విద్యార్థి సయ్యద్ మొహిద్దిన్ ఖాదరి అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు.

ఘనంగా సన్మానం:
జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించి ఆత్మకూరు పేరును దేశస్థాయిలో నిలబెట్టిన మొహిద్దిన్ ఖాదరిని, బీజేపీ పట్టణ అధ్యక్షులు నున్న సంతోష్ కుమార్ గురువారం బాలుని నివాసంలో ఘనంగా సత్కరించారు. బాలుడి తండ్రి సయ్యద్ జమీర్, కుటుంబ సభ్యులు మరియు సన్నిహితుల సమక్షంలో ఖాదరిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.
ఈ సందర్భంగా నున్న సంతోష్ కుమార్ మాట్లాడుతూ: "చిన్న వయసులోనే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించడం ఆత్మకూరు పట్టణానికే గర్వకారణం. ఇలాంటి క్రీడాకారులను ప్రోత్సహించడం మనందరి బాధ్యత. భవిష్యత్తులో ఈ బాలుడు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి."

కోచ్‌కు అభినందనలు:
యుద్ధ కళలలో శిక్షణ ఇచ్చి, బాలుడిని విజేతగా తీర్చిదిద్దిన కోచ్ సాయికి సంతోష్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరులో ఇలాంటి యుద్ధ కళలను మరింత మంది విద్యార్థులకు నేర్పించాలని, తద్వారా మరిన్ని బంగారు పతకాలు సాధించేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుని కుటుంబ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు

# గిరి ప్రదక్షణ ఉభయదారులుగా సేవ చేసే అవకాశం మా పూర్వజన్మ సుకృతం:

## - మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి





శ్రీకాళహస్తి , పెన్ పవర్, ఫిబ్రవరి ,19 :
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షణ ఉత్సవానికి ఉభయదారులుగా వ్యవహరించడం తమ పూర్వజన్మ సుకృతమని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరమేశ్వరుని అనుగ్రహంతో ఈ పవిత్ర సేవలో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. శివయ్య చల్లని చూపు ఎల్లప్పుడూ ప్రజలందరిపై ఉండి, ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.భక్తుల భారీ సమక్షంలో గిరి ప్రదక్షణ వేడుకలు భక్తిశ్రద్ధలతో, వేదఘోషల మధ్య ఘనంగా కొనసాగాయి. దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు





# ఐ ట్రిపుల్ సి పనుల పురోగతిపై సమీక్షించిన స్మార్ట్ సిటీ ఎం.డి. ఎన్.మౌర్య, ఐఏఎస్.





తిరుపతి/పెన్ పవర్/ఫిబ్రవరి 19
నగరంలో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై స్మార్ట్ సిటీ ఎం.డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, ఐఏఎస్. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అధికారులు సమన్వయం చేసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ఇంటిగ్రెటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఏర్పాటు చేస్తున్న సిసి కెమెరాల అనుసంధానం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ.రవి, డి.ఈ.రాజు, ఎన్ఈసి సంస్థ జనరల్ మేనేజర్ అనురాగ్ సక్సెనా, కెల్ట్రాన్ సంస్థ ప్రతినిధులు సతీష్ కుమార్, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# కష్టపడిన సంపద చిన్న క్లిక్‌తో మాయమవుతోంది

## సైబర్ క్రైం సమస్య తీవ్రతను సభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

## సైబర్ మోసాలు.. సమాజ భద్రతకు అతిపెద్ద సవాల్ చిన్నతనంలోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలి

## సైబర్ నేరాలపై శిక్షలు కఠినంగా అమలు చేయాలి ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన హోం మంత్రి అనిత

## సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం పాఠశాల స్థాయిలో అవగాహన పెంచేలా కృషి చేస్తున్నాం

కోవూరు పెన్ పవర్ ఫిబ్రవరి 19.

నేటి టెక్ యుగంలో సైబర్ క్రైం అనేది ఒక వ్యక్తి సమస్యలా కాకుండా సమాజ భద్రతకు పెను సవాల్ గా మారిందని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సైబర్ క్రైం అంశంపై గురువారం ఆమె అసెంబ్లీలో మాట్లాడారు. డిజిటల్ లావాదేవీలు పెరిగిన కొద్దీ, డిజిటల్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, ప్రజల అమాయకత్వాన్నే ఆయుధంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పార్ట్‌టైమ్ జాబ్స్, ట్రేడింగ్, మ్యాట్రిమోని పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని ఆవేదన చెందారు. ఓ టి పి, కె వై సి పేరుతో మోసాలు, సోషల్ మీడియా అకౌంట్ల హ్యాకింగ్, ఫేక్ జాబ్, లాటరీ, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు, “డిజిటల్ అరెస్ట్” పేరుతో బెదిరింపులు.. బాధిత కుటుంబాలకు జీవితాంతం మరిచిపోలేని గాయాలుగా మారుతున్నాయన్నారు. కష్టపడి సంపాదించిన డబ్బు నిమిషాల్లో మాయమవుతోందని చెప్పారు. ఉదాహరణకు కోవూరుకు చెందిన ఒక మహిళకు కేవైసీ పేరుతో వచ్చిన లింక్ క్లిక్ చేసి 2 లక్షలు పోగొట్టుకున్న విషయాన్ని ఆమె సభలో ప్రస్తావించారు.

సైబర్ క్రైం కంట్రోల్‌కు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. 24/7 కాల్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ సెల్‌లను బలోపేతం చేయాలని, ఫిర్యాదు చేసిన వెంటనే ఫాస్ట్ ట్రాక్ యాక్షన్ సిస్టమ్ ఉండాలన్నారు. బ్యాంకులు, టెలికాం కంపెనీలతో స్ట్రాంగ్ కోఆర్డినేషన్, సైబర్ నేరాలపై కఠిన శిక్షలు ఉండాలన్నారు. అలాగే ప్రజలు కూడా ఎవరికీ ఓ టి పి, పి ఐ ఎన్ , బ్యాంక్ వివరాలు చెప్పకూడదని, అనుమానాస్పద లింకులపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్



చేయవద్దన్నారు. మోసం జరిగితే ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, డిజిటల్ ఇండియా బలంగా ఉండాలంటే, సైబర్ భద్రత ఇంకా బలంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్‌పై పోరాటం అంటే కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రభుత్వ విధానం, వ్యవస్థ, ప్రజల అవగాహన మూడు కలిసి నడవాల్సిన అవసరాన్ని ఆమె వెల్లడించారు.

హోం మంత్రి అనిత స్పందన..

అనంతరం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. కంటికి కనిపించని శత్రువులా సైబర్ క్రైం జరుగుతోందని, ఇందులో మోసపోతున్న అనేక మంది చదువుకున్న, ఉన్నత స్థితిలో ఉన్నవారేనని ఆమె పేర్కొన్నారు. గ్రామాలకు కూడా ఈ ధోరణి పెరుగుతోందన్నారు. 10 వ తరగతికే ఉద్యోగాలు అంటూ మయన్మార్, థాయ్‌ల్యాండ్, ఇతర దేశాలకు పంపిస్తామంటూ మోసాలు చేస్తున్నారని అన్నారు. ఇటీవల ఏపీకి చెందిన 110 మందిని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు గారి సహకారంతో రక్షించామన్నారు. సైబర్ క్రైంపై అవగాహన చాలా అవసరమని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం వచ్చిన తర్వాత 1596 అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 1930 అనే ఒక హెల్ప్ లైన్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రజల్లో డిజిటల్ అరెస్టుల పేరుతో ఒక భయం ఏర్పడుతోందని, అమ్మాయిలను కూడా ఎరగా వాడుతున్నారని అన్నారు. బిజినెస్ టిప్స్ అనే పేరుతో డబ్బులు దండుకుంటున్నారని అన్నారు.

సీఎం చంద్రబాబు ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రతి జిల్లాలో సైబర్ సెల్ ఏర్పాటు చేశారన్నారు. 26 జిల్లాల్లో సైబర్ పోలీస్ స్టేషన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక కమిటీ ఏర్పాటు అయిందని, ఇప్పటికే రెండు సమావేశాలు పూర్తయ్యాయని, తప్పకుండా సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే పోలీసు సిబ్బందిలో కూడా సైబర్ మోసాలపై ప్రత్యేక ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉందన్నారు. పక్కా ప్రణాళికతో దీనిపై ముందుకు సాగుతున్నామని చెప్పారు.

# తిరుమలలో పాద రక్షల ట్రాకింగ్ వ్యవస్థకు విశేష స్పందన.

## -ఆరు నెలల్లో 8.45 లక్షలకు పైగా పాద రక్షల సమర్థ నిర్వహణ.

## -ఈ నూతన విధానంపై భక్తుల్లో హర్షాతిరేకాలు.

## -త్వరలో మరిన్ని ప్రాంతాలకు సేవలు విస్తరణ.

తిరుమల/పెన్ పవర్/ఫిబ్రవరి 19

తిరుమలలో భక్తుల సౌకర్యార్థం టీటీడీ అమలు చేస్తున్న ను= కోడ్ ఆధారిత పాద రక్షల ట్రాకింగ్ & మేనేజ్‌మెంట్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా పనిచేస్తూ విశేష ఫలితాలను అందిస్తోంది. ఆధునిక సాంకేతికతతో అమలులోకి వచ్చిన ఈ విధానం ద్వారా భక్తులు తమ పాద రక్షలను సులభంగా డిపాజిట్ చేసి, తిరిగి వేగంగా పొందగలుగుతున్నారు.



2025 సెప్టెంబర్ నుండి 2026 ఫిబ్రవరి 15 వరకు మొత్తం 8,45,816 పాద రక్షల డిపాజిట్‌డెలివరీ లావాదేవీలు ఈ విధానం ద్వారా విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ కాలంలో భక్తుల నుంచి స్వీకరించిన 4,24,047 పాద రక్షల్లో, 4,21,769 పాద రక్షలను సురక్షితంగా తిరిగి అందజేయడం జరిగింది. దాదాపు అన్ని కేంద్రాల్లో పాద రక్షల తిరిగి పొందే శాతం అత్యంత అధికంగా నమోదు కావడం ఈ వ్యవస్థ సమర్థతను ప్రతిబింబిస్తోంది.

వీటిలో ఏటీజీహెచ్ కేంద్రంలో మొత్తం 44,714 పాద రక్షలు సేకరించగా, వాటిలో 44,340 పాద రక్షలు భక్తులకు పంపిణీ చేయబడ్డాయి. కృష్ణ తేజ సర్కిల్ కేంద్రంలో 56,019 పాద రక్షలు సేకరించగా, 55,428 పాద రక్షలు పంపిణీ అయ్యాయి. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో 55,238 పాద రక్షలు సేకరించబడగా, 54,928 పాద రక్షలు భక్తులకు అందించబడ్డాయి. పీఏసీ-5 కేంద్రంలో అత్యధికంగా 1,38,270 పాద రక్షలు సేకరించగా, వాటిలో 1,37,904 పాద రక్షలు పంపిణీ చేయబడ్డాయి. అదే విధంగా రామ్ భగీచ విశ్రాంతి గృహం కేంద్రంలో 76,556 పాద రక్షలు సేకరించగా, 76,071 పాద రక్షలు పంపిణీ అయ్యాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కేంద్రంలో 53,250 పాద రక్షలు సేకరించబడగా, 53,098 పాద రక్షలు పంపిణీ చేయబడ్డాయి.

ప్రత్యేకించి రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ విధానం భక్తులకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోంది. ఫిబ్రవరి 1 నుండి 15వ తేదీ వరకు కేవలం 15 రోజుల్లోనే 1,35,314 పాద రక్షల లావాదేవీలు జరగడం ద్వారా రద్దీ సమయాల్లోనూ ఈ వ్యవస్థ ఎంత వేగంగా, క్రమబద్ధంగా పనిచేస్తోందో స్పష్టమవుతోంది.


గతంలో తిరుమలలోని రద్దీ ప్రాంతాల్లో పాద రక్షలు అస్తవ్యస్థంగా పడి ఉండటం, భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆ సమస్యలకు పరిష్కారంగా ప్రత్యేక చొరవ తీసుకుని ఈ విధానానికి శ్రీకారం చుట్టారు.

కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సహకారంతో డిప్యూటీ ఈవో శ్రీ సోమన్నారాయణ ఆధ్వర్యంలో పాద రక్షల నిర్వహణలో పారదర్శకత, క్రమబద్ధత పెరగడంతో భక్తులకు కలిగే ఇబ్బందులు గణనీయంగా తగ్గాయి.

ఈ నూతన విధానంపై భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో పాద రక్షలు తప్పిపోవడం, గందరగోళం ఏర్పడడం వంటి సమస్యలు తరచుగా ఎదురయ్యేవనీ, నూతన ట్రాకింగ్ విధానం అమలులోకి వచ్చిన తర్వాత ఆ సమస్యలు దాదాపుగా పూర్తిగా తొలగిపోయాయని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి భవిష్యత్తులో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయడం, సిబ్బంది సంఖ్యను పెంచడం వంటి చర్యలతో ఈ వ్యవస్థను మరింత విస్తరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



త్వరలో కల్యాణకట్ట, బేడి ఆంజనేయస్వామి ఆలయం, ఏటీసీ సర్కిల్ వద్ద మరో మూడు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

తిరుమల నాలుగు మాడ వీధుల్లో పాదరక్షల వాడకం నిశిద్దశీ

తిరుమల శ్రీవారి ఆలయం చుట్టూ ఉండే నాలుగు మాడ వీధుల్లో దాదాపు ప్రతి రోజూ స్వామి వారు విహరిస్తారు కనుక పాద రక్షలు ధరించడం నిషిద్ధం. కావున భక్తులు తప్పనిసరిగా పాద రక్షల కొరకు టీటీడీ ఏర్పాటు చేసిన ఈ నూతన విధానాన్ని వినియోగించుకోగలరు.

ఈ ఆధునిక ట్రాకింగ్ వ్యవస్థ వల్ల తిరుమలలో పరిశుభ్రత మరింత మెరుగుపడటమే కాకుండా, భక్తులకు సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన దర్శన అనుభవం అందించడమే ప్రధాన లక్ష్యంగా టీటీడీ ఈ ాఆ్ఖతీ ాప్ట్రశీవ ఖవవజూఱఅస్త్ర విధానాన్ని అమలు చేస్తోంది.



# యోగనాట్య సమ్మేళనం భక్తులను మంత్ర ముగ్ధుల్ని చేసిన సాన్విత సూర్యకుమార్



శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి ,19 :

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయం ఆవరణలోని ధూర్జటి కళా ప్రాంగణంలో సాన్విత సూర్యకుమార్ యోగనాట్య సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఆధ్యాత్మికతకు కళారూపాల సౌందర్యాన్ని జోడిస్తూ యోగ, నాట్యం కలిపిన ఈ వినూత్న కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. మాస్టర్ లావణ్య శిష్య బృందం యోగాసనాలను నృత్య భంగిమలతో సమన్వయం చేస్తూ అందమైన ప్రదర్శన ఇచ్చారు.‘ఓం నమశ్శివాయ’ నాదాల మధ్య సాగిన ప్రదర్శనలో శివతాండవం, నటరాజ భంగిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యోగాసనాల ద్వారా శరీర సౌష్టవాన్ని, నాట్యంతో భావవ్యక్తీకరణను ప్రతిబింబిస్తూ కళాకారులు ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రేక్షకులకు అందించారు.భక్తులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆస్వాదించారు. కార్యక్రమం అనంతరం ఆలయం తరఫున ట్రస్ట్ బోర్డు సభ్యుడు దండి రాఘవయ్య, ఆలయ అధికారులు చిన్నారి సాన్విత సూర్యకుమార్ మరియు మాస్టర్ లావణ్యను సత్కరించి షీల్డ్, సర్టిఫికేట్, ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా చిన్నారులు మాట్లాడుతూ, యోగ శరీరానికి ఆరోగ్యం అందిస్తే నాట్యం మనసుకు ఆనందం ఇస్తుందని, ఈ రెండింటి సమ్మేళనం సంపూర్ణ జీవన విధానాన్ని తెలియజేస్తుందని

# రెండేళ్లయిన గూడూరు నగరభివృద్ధిని విస్మరించిన కూటమి ప్రభుత్వం-(సిపిఎం)

పెన్ పవర్, ఫిబ్రవరి ,19 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైనా గూడూరు నగర అభివృద్ధి కి ఏమి చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ నారాయణ విమర్శించారు,, గూడూరులో పాత్రికేయుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వి,నారాయణమాట్లాడుతూ....గత ప్రభుత్వం గూడూరు నగర పంచాయతీ ని అభివృద్ధి చెయ్యకపోవడంతో గూడూరు ప్రజలు ఓట్లు వేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అయినా గూడూరు నగర పంచాయతీ అభివృద్ధికి చేసింది ఏమి లేదని, పన్నుల వసూలు మాత్రం ప్రజల దగ్గర ముక్కు పిండి వసూలు చేస్తున్నారు తప్ప గూడూరు ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నారని, గూడూరు పట్టణంలో త్రాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నదని, ఇప్పటికే కొన్ని వార్డులలో వారం రోజులైనా కూడా కొళాయిలకు నీళ్లు రావడంలేదని, వేసవికాలం వస్తున్నదని ఈ తాగునీటి సమస్య ఇంకా తీవ్రతరం అవుతుందని, గూడూరు పట్టణానికి నాలుగు దిక్కులుగా నాలుగు స్తంభాలు ఉన్నట్లు నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయని గత ప్రభుత్వం 54 కోట్లతో ప్రారంభించి ట్యాంకుల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందని, కూటమి ప్రభుత్వం పాలకులు కనీసం ఆ ట్యాంకుల గురించి మాట్లాడడం లేదని, ట్యాంకుల నిర్మాణం పూర్తయితే పట్టణ ప్రజలకు త్రాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని , అదేవిధంగా మునగాల రోడ్డులో ఉన్న డంపు యార్డ్ వల్ల వచ్చే దుర్వాసనతో ఆ ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ అనారోగ్యాలకు గురవుతున్నారని, ఆ డంపు యార్డ్ ను ఊరికి



ఐదు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటుచేసి ప్రజలను అనారోగ్యాలకు గురికాకుండా కాపాడాలని సిపిఎం పార్టీగా అనేక దఫాలుగా పాలకులకు అధికారులకు విన్నవించుకున్న పెడచెవిన పెడుతున్నారని, ఈ ప్రాంతంలో ఉండే ఇసుకను తవ్వుకుని కాంట్రాక్టర్ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాడని ఆ ఇసుక లారీల వల్ల గూడూరు పట్టణంలో ట్రాఫిక్ జామ్ ఎక్కువైందని, ఆ ఇసుక కాంట్రాక్టర్ నుండి గూడూరు అభివృద్ధి కొరకు నిధులు రాబట్టుకోనీ అభివృద్ధి చేయాలని, గూడూరు పట్టణంలో పేద రైతులు వ్యవసాయ కూలీల అధిక సంఖ్యలో ఉన్నారని నగర పంచాయతీ చేశాక గూడూరు పట్టణానికి ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడంతో గూడూరు పట్టణంలో ఉన్న పేద ప్రజలకు వేసవి కాలంలో ఉపాధి లేకుండా పోయిందని, వేసవిలో ఉపాధి లేక వలసలు పోయే పరిస్థితి ఏర్పడిందని, వలసల నివారణకి గూడూరు పట్టణంలో ఏవైనా పరిశ్రమలు ఉన్నాయా అంటే ఒక్క పరిశ్రమ లేదని,గూడూరు పట్టణంలో అర్బన్ హెల్త్ సెంటర్ లేదని ఉన్న ఒక్క ప్రాథమిక వైద్యశాల కేవలం జ్వరాలకు మాత్రమే ఉన్నదని ఆ వైద్యశాలను 50 పడకులకు అభివృద్ధి చేయాలని, గూడూరు పట్టణాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందని, ఆ విధంగా గూడూరు అభివృద్ధి గురించి కూటమి ప్రభుత్వం ఆలోచించడం లేదని, ఓట్లు వేయించుకొని గూడూరు ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మరియు అధికారులు గూడూరు పట్టణ అభివృద్ధికి కృషి చేయకపోతే సిపిఎం పార్టీగా క్షేత్రస్థాయిలో ప్రజలందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు,,

అదేవిధంగా సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జే, మోహన్ మాట్లాడుతూ.... గూడూరు ప్రజలంటే గత ప్రభుత్వం ప్రస్తుత కూటమి ప్రభుత్వాలకు ఎందుకు అంత వివక్షతో అర్థం కావడం లేదని, గూడూరు ప్రజలు మనుషులు కారా అని,వారు ఓట్లు వేయలేదా అని, ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ తప్పులను చూపిస్తూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గూడూరు ను అభివృద్ధి చేస్తామని మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకొని నేడు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న గూడూరు అభివృద్ధి గురించి కూటమి ప్రభుత్వ పాలకులు నోరు మెదపడం లేదని, గూడూరు పట్టణ ప్రజలకు తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వలేకపోతున్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పాలకులు అధికారులు గూడూరు పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించి గూడూరు పట్టణ అభివృద్ధికి కృషి చేయకపోతే సిపిఎం పార్టీగా గడపగడపకు తిరిగి ప్రజలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు,,, కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు దానమన్న, రామాంజనేయులు, రంగన్న తదితరులు పాల్గొన్నారు,

## శివాజీ స్ఫూర్తిగా ధర్మరక్షణకు పాటుపడాలి

రేపల్లె పెన్ పవర్, ఫిబ్రవరి ,19 :
సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంస్కృతి ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ తెలియజేశారు. 1630 ఫిబ్రవరి 19వ తేదీన మహారాష్ట్ర పూణే సమీపంలో ఉన్న శివనేరి కోటలో షాజీ బోంస్లే, జిజియాభాయి దంపతులకు జన్మించిన శివాజీ తల్లి రామాయణ మహాభారత గాథలు వింటూ తిరిగి ధైర్య సాహసాలు హిందూ ధర్మం 16 సంవత్సరాల వయసులోనే రాయఘడ్ కోటను జయించి సుమారు 300 పైన కోటలు జయించి చత్రపతి శివాజీ గా పట్టాభిషిక్తుడై హిందూ ధర్మ రక్షకుడుగా పేరొందిన శివాజీ జయంతిని ప్రతి ఒక్క హిందువు జరుపుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా ప్రముఖ్ బూర్లె అరుణకుమారి కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు కొత్త రవితేజ, ధర్మ ప్రచారక్ లు జంజనం హేమశంకరరావు చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ చేయూత




రేపల్లె పెన్ పవర్, ఫిబ్రవరి ,19 :
ఇటీవల రేపల్లె రూరల్ మండలం లోని
అరవపల్లి పంచాయతీ గుంటూరు వారి పల్లె గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగిన రెండు కుటుంబాల వారికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ , రేపల్లె వారి ద్వారా వంట సరుకులు ,తాగునీరు మొదలగునవి ఇవ్వటం జరిగినది. చిక్కాల సూరిబాబు చిక్కాల రత్నం కుటుంబాలకి రెడ్ క్రాస్ సహాయం చేసినది. ఆపత్కాల సమయంలో ప్రజలకు సహాయం చేస్తుందని, అగ్ని ప్రమాదాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ వసంత వీర రాఘవయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది జయచంద్ర ,ఆనంద్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పెన్షనర్లు తమ వార్షిక లైవ్ సర్టిఫికెట్లను ఈనెల 28 లోగా సబ్మిట్ చేయాలి

**- రేపల్లె సబ్ ట్రెజరీ అధికారి మల్లికార్జునరావు**

రేపల్లె పెన్ పవర్, ఫిబ్రవరి ,19 :
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ వార్షిక లైఫ్ సర్టిఫికెట్లను సబ్మిట్ చేయడానికి ఇంకా 10 రోజుల గడువు మాత్రమే ఉంది. అశ్రద్ధ చేయకూడదు. ఈ నెల 28వ తేదీలోగా కచ్చితంగా లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. అని రేపల్లె సబ్ ట్రెజరీ అధికారి మల్లికార్జునరావు బుధవారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ప్రతి గ్రామంలోనూ అందుబాటులో అనేక కంప్యూటర్ నెట్ సెంటర్లు ఉన్నాయి. కంప్యూటర్ తదితర పరికరాలు కలిగి ఉన్న పోస్ట్ ఆఫీస్లలోనూ లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేసే అవకాశం ఉంది. కంప్యూటర్ లేదా టచ్ ఫోన్లో పరిజ్ఞానం ఉన్న పెన్షనర్లు లేదా వారి కుటుంబ సభ్యులు జీవన ప్రమాణ యాప్ ద్వారా లైఫ్ సెట్ వార్షిక లైఫ్ సర్టిఫికెట్లను చాలా సులభంగా సబ్మిట్ చేస్తున్నారు. ప్రస్తుతం వివిధ అనారోగ్య కారణాల చేత ఇతర ప్రాంతాలలోని ఆసుపత్రులలో ఉన్నవారు కూడా తమకు అందుబాటులో ఉన్న కంప్యూటర్ నెట్ సెంటర్ల వారిని తీసుకువెళ్లి, లైఫ్ సర్టిఫికెట్స్ సబ్మిట్ చేసిన విషయాన్ని తెలియజేస్తున్నారు.లి

డిజిటల్ విధానంలో ఆన్లైన్లో లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేసే అవకాశం లేని రోజుల్లో వ్యయ ప్రయాసలకు గురై, నానా యాతనలు పడుతూ ట్రెజరీ ఆఫీసు వద్దకే వచ్చి తమ లైఫ్ సర్టిఫికెట్లను సబ్మిట్ చేయవలసిన పరిస్థితి ఉండేది. అటువంటి బాధల నుండి బయటపడి ఆన్లైన్లో లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేసే అవకాశం ఉండగా కాలయాపన, అలసత్వం వహించకూడదు.లి

వేలిముద్రలు ఐరిష్ పడని వారు కచ్చితంగా ఫిజికల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్స్ సబ్మిట్ చేయవలసి ఉంది. అటువంటివారు వెంటనే ట్రెజరీ అధికారులకు వారి వివరాలను తెలియజేయాలి. అటువంటివారు ఇప్పుడే తీయించుకున్న ఫుల్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు మరియు బ్యాంక్ పాస్బుక్ మొదటి పేజీ జిరాక్స్ లు సిద్ధంగా ఉంచుకోవాలి. ఈ పని కచ్చితంగా జరగాలి.

గత సంవత్సరం ఫిజికల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేశారంటే వారికి వేలిముద్రలు లేదా ఐరిష్ పడలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అందుచేత అటువంటివారు పై పేరాలో తెలియజేసిన వివరాలను సిద్ధం చేసుకోవాలి.లి

పెన్షనర్లుగా వార్షిక లైఫ్ సర్టిఫికెట్ను సబ్మిట్ చేయడం మన ఖచ్చితమైన పని. సకాలంలో లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేద్దాం.



# ఆశాజనకంగా జొన్న...మొక్కజొన్న పంట సాగు





రేపల్లె పెన్ పవర్, ఫిబ్రవరి ,19 :
రేపల్లె ప్రాంతంలో జొన్న మొక్కజొన్న పైర్లు ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు రేపల్లె వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వేల ఎకరాల్లో రైతులు ఈ పంటలకు సాగు చేశారు వాతావరణా అనుకూలంగా ఉండటం నీరు అందుబాటులో ఉండడంతో పైరు ఎదుగుదల ఆశాజనకంగా ఉంది మొక్కజొన్న సాగుకు ఆరుతడులు, కౌలు కలుపుకొని ఎకరానికి సుమారు 60000 పైబడి పెట్టుబడులు పెట్టినట్లు రైతులు చెబుతున్నారు ప్రస్తుతం పైర్లు వేపుగా కండెలు ఉండడంతో నాణ్యమైన దిగుబడి వస్తుందన్న ఆశతో రైతులు ఉన్నారు మొక్కజొన్నకు ప్రభుత్వం క్వింటాలుకు 2400 మద్దతు ధర ఇస్తుంది ఎకరానికి 35 40 దిగుబడి వచ్చే పరిస్థితి ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు జొన్న పంట బిస్కెట్ తెల్లజొన్న పరిస్థితి కూడా ఆశాజనకంగా ఉంది గతంలో ఎన్నడూ లేని విధంగా తక్కువ పెట్టుబడి పశ్చిమ రాయల పరిస్థితిలో నేపథ్యంలో అధిక విస్తీర్ణంలో జొన్న పంటను సాగు చేయడం ఎందుకు నిదర్శనం ఒక ఎకరం జొన్న సాగుకు కౌలుతో కలుపుకుని 35000 వరకు ఖర్చు అయినట్లు రైతులు చెబుతున్నారు ప్రస్తుతము ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు 3699 రూపాయలు ఉంది ఎకరానికి 15 నుంచి 20 క్వింటాలు దిగుబడి వచ్చే పరిస్థితిలో కనిపించడంతో సాగుదారులు మద్దతు ధరపై ఆశతో ఉన్నారు

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రేపల్లెలో కుక్కల ఆపరేషన్ థియేటర్కు మంత్రి సోదరుడు శివప్రసాద్ శంకుస్థాపన

రేపల్లె పెన్ పవర్, ఫిబ్రవరి ,19 :
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రేపల్లె ప్రాంతీయ పశువైద్యశాలలో కుక్కల ఆపరేషన్ థియేటర్ భవన నిర్మాణానికి టిడిపి నేత మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ శంకుస్థాపన చేశారు జంతు సంరక్షణకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఈ సందర్భంగా శివప్రసాద్ అన్నారు ఈ కార్యక్రమంలో రేపల్లె పశుసంవర్ధక శాఖ ఏడిఏ బి నాంచారయ్య జెడి వేణుగోపాల్ టిడిపి నేతలు జి మురహరరావు పి సాయికుమార్ మురళీధర్ రావు దండుప్రోలు పిచ్చయ్య కేశన రామకృష్ణ దేవగిరి రవిశంకర్ వై ధర్మతేజ పశుసంవర్ధక శాఖ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు



# ఏపీలో వెల్త్ ఫండ్స్

**విజయవాడ, ఫిబ్రవరి 19, పెన్ పవర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. అప్పులు ఆంధ్రప్రదేశ్ అని పేరు తెచ్చుకున్న రాష్ట్రాన్ని సంపన్న ఆంధ్రప్రదేశ్‌గా మార్చడానికి ఒక భారీ ఆర్థిక ప్రయోగం మొదలైంది. అదే ఆంధ్రప్రదేశ్ వెల్త్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్టు 2026-27 బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రతిపాదించారు.ఓ నిధి ఏర్పాటుకు అధికారికంగా పచ్చజెండా ఊపారు. ఇది కేవలం ఒక ప్రభుత్వం సంస్థ కాదని, రాబోయే తరాల భవిష్యత్‌ను బంగారు మయం చేసే ఆర్థిక యంత్రమని ప్రభుత్వం చెబుతోంది. మనం ఇంట్లో ఉన్న అదనపు డబ్బును లేదా బంగారాన్ని ఎలాగైతే బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామో లేదా భూమిని కొని దాని మీద వచ్చే ఆదాయంతో మరిన్ని ఆస్తులు కొనే ప్రయత్నం చేస్తామో ప్రభుత్వం అలాంటి ప్రయత్నమే చేస్తుంది. ప్రభుత్వం దగ్గర ఉన్న కొన్ని ఆస్తులను కేవలం ఖాళీగా ఉంచకుండా వాటిని ఆదాయం ఇచ్చే వనరులుగా మార్చుకుంటుంది. వాటిని ఈ వెల్త్‌ఫండ్స్‌లో జమ చేస్తుంది. ప్రపంచంలో నార్వే, సింగపూర్ వంటి దేశాలు ఇలాంటి సోవర్నిటీ వెల్త్ ఫండ్ ఏర్పాటు చేసి నేడు ప్రపంచంలోనే అత్యంత ధనవంత దేశాలుగా ఎదిగాయి. భారత్ దేశంలో ఒక రాష్ట్ర స్థాయిలో ఇలాంటి ప్రయోగం జరగడం ఇదే మొదటిసారి. 2024లో చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ వంటి ఆదాయం వచ్చే నగరం లేకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. ప్రస్తుతం ఆ అప్పులు 12 నుంచి 1 లక్ష కోట్లు వరకు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఏపీ కడుతున్న వడ్డీలే యాభై వేల కోట్లకుపైగా ఉంటోంది. కేవలం ప్రజల మీద పన్నులు వేయడం ద్వారా లేదా మళ్లీ అప్పులు చేయడం ద్వారా ఈ పరిస్థితి మార్చలేమని ప్రభుత్వం గుర్తించింది. అందుకే సంపద సృష్టి అనే మంత్రాన్ని జపిస్తోంది. ప్రభుత్వం వద్ద ఉన్న వనరులను తెలివిగా వాడుకొని ఆస్తులను అమ్మకుండానే ఆదాయం సంపాదించడం ఏకైక మార్గమని వెల్త్ ఫండ్‌ను తెరపైకి తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు 2047 నాటికి అంటే భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు నిండే నాటికి ఏపీని అగ్ర రాష్ట్రాల జాబితాలో చూడాలని అనుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగానే ఈ ఫండ్‌ను క్రియేట్ చేస్తున్నారు. దీని వల్ల ప్రతి ఆంధ్రప్రదేశ్‌లో ఉండే వ్యక్తి ఆదాయం జాతీయ సగటు కంటే మూడు రెట్లు పెరుగుతుందని చెబుతున్నారు. పేదరికాన్ని జీరోకు వస్తుందని లెక్కలు వేస్తున్నారు. అమరావతి, పోలవరం వంటి మెగా ప్రాజెక్టులకు నిధుల కొరత కూడా ఉండబోదని వివరిస్తున్నారు. డబ్బులు లేని రాష్ట్రంలో ఈ ఫండ్‌లో డబ్బులు ఎలా పెడుతుందని అనుమానం చాలా మందికి ఉంటుంది. ఇక్కడే అసలైన ట్విస్ట్ ఉంది. ప్రభుత్వం ఈ నిధిలో నగదు కంటే ఎక్కువగా ఆస్తులను పెట్టుబడిగా పెట్టనుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ చేతిలో మూడు నుంచి నాలుగు లక్షల ఎకరాల భూమి ఉంది. దీని విలువ మార్కెట్‌లో పది నుంచి 15 లక్షల కోట్లు ఉంటుంది. ఈ భూములను డెవలప్ చేసి లీజుకు ఇస్తే ఆదాయం వస్తుంది. ఏపీఎస్‌ఆర్టీసీ, జెన్కో వంటి సంస్థల్లో ఉన్న వాటాలను తెలివిగా వాడుకోవాలని చూస్తోంది. సముద్ర తీరంలోని ఇసుక, ఆయిల్, గ్యాస్ నిక్షేపాల నుంచే ఆదాయాన్ని ఫండ్‌కు తరలిస్తారు. విదేశాల్లో ఉన్న తెలుగువారు, రాష్ట్రంలో ఉన్న వ్యాపారవేత్తలు ఇతర ఉన్నత వర్గాలు దీనికి ఫండ్ ఇచ్చేలా ప్రోత్సహిస్తారు. ఇప్పటికే దీనికి ప్రారంభ పెట్టుబడిగా 100 కోట్లు ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ కేటాయించింది. నార్వే దగ్గర ఆయిల్ ద్వారా వచ్చిన డబ్బుతో ఒక ఫండ్ ఏర్పాటు చేశారు. ఈ రోజు ఆ ఫండ్ విలువ సుమారు .1.7 ట్రిలియన్‌లు అంటే 140లక్షల కోట్లు. నార్వేలో ప్రతి పౌరుడి పేరు మీద కొన్ని కోట్ల రూపాయలు సంపద ఉంది. అక్కడ ప్రజలు ఉచిత విద్య, వైద్యం ఈ ఫండ్ ద్వారానే అందుతుంది.

1974లో సింగపూర్ ప్రభుత్వం తన కంపెనీలను నిర్వహించడానికి టెమాసెక్ అనే సంస్థను పెట్టింది. చంద్రబాబు ఈ మోడల్‌ను చాలా ఇష్టపడతారు. సింగపూర్ ఎయిర్‌లైన్స్, డీబీఎస్ బ్యాంకు వంటివన్నీ ఈ ఫండ్ లాభాలతోనే నడుస్తున్నాయి. అందుకే సింగపూర్ వెళ్లినప్పుడు అక్కడి నిపుణులతో చర్చిస్తారు. ఆంధ్రప్రదేశ్ వెల్త్ ఫండ్ ఏర్పాటుతో సామాన్యుడికి ఎలాంటి ప్రయోజనం ఉంటుందనే అనుమానం చాలా మందిలో ఉంటుంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పిల్లలను వదిలేసి... ప్రియుడు దగ్గరకు వెళ్లి

**తిరుపతి, ఫిబ్రవరి 19, పెన్ పవర్ :** సోషల్ మీడియా పరిచయాలు ఎలాంటి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయో మనం రోజూ చూస్తూనే ఉన్నాం. అనైతిక సంబంధాలు, అసాంఘిక పనులకు సోషల్ మీడియాను మాధ్యమంగా వాడుకుంటున్నారు కొందరు. తాజాగా సోషల్ మీడియా పరిచయం ఓ వివాహితను దారి తప్పేలా చేసింది. పెళ్లై, పిల్లలున్న వివాహిత సోషల్ మీడియా మాయలో పడింది. ఏపీలో పరిచయం అయిన వ్యక్తిని నమ్మి.. అతని ప్రేమలో మునిగిపోయింది. కానీ ఆ నమ్మకంలో చేసిన తప్పు.. చివరకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. వివరాల్లోకి వెళ్తే.. జార్ఖండ్‌కు చెందిన 30 ఏళ్ల వివాహితకు ఇన్ స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు గంటల కొద్దీ చాటింగ్‌లో మునిగితేలారు. ఆపై ఆడియో, వీడియో కాల్స్ కూడా నడిచాయి. వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. తనను ధనవంతుడిగా, అనుభవం ఉన్న వ్యాపారవేత్తగా పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి మాటలను ఆమె పూర్తిగా నమ్మేసింది. భర్త, ముగ్గురు చిన్నారులను వదిలి.. ఇన్‌స్టాగ్రామ్ ప్రియుడితో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ఆ మహిళ ఇంటి నుంచి పారిపోయి ఏపీ చేరుకుంది. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో తన ఆన్ లైన్ ప్రియుడ్ని కలుసుకుంది. అయితే అక్కడే అసలు నిజం బయటపడింది. తనను ధనవంతుడు అని చెప్పుకున్న వ్యక్తి వాస్తవానికి దినసరి కూలీగా పనిచేస్తున్నాడని తెలిసి ఆమె షాక్ గురైంది. తాను మోసపోయానని గ్రహించి తీవ్ర నిరాశకు లోనైంది.. ఇంతలో ఆమె కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఫోన్ సిగ్నల్, సోషల్ మీడియా వివరాల ఆధారంగా ఆమె ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. పోలీసుల జోక్యంతో మహిళను సురక్షితంగా తీసుకువచ్చారు. తల్లిదండ్రులు, బంధువులు కలిసి ఆమెకు నచ్చజెప్పడంతో చివరకు తిరిగి తన కుటుంబం వద్దకు చేరింది. ఈ ఘటనలో విశేషం ఏమిటంటే భార్య దారి తప్పినా.. భర్త మంచి మనసుతో తిరిగి ఆమెను ఏలుకునేందుకు అంగీకరించాడు. కుటుంబం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం మరో అవకాశాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. టెక్నాలజీ దూరాలను దగ్గర చేస్తుంది. కానీ మరోవైపు చెడు సావాసాలను కూడా పరిచయం చేస్తుంది. అందుకే అప్రమత్తత అవసరం అని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తిరుమలలో స్మార్ట్ షూ ట్రాకింగ్

**తిరుమల, ఫిబ్రవరి 19,పెన్ పవర్ :** ఏడుకొండల వాడి చెంతకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ౹ు= కోడ్ ఆధారిత పాదరక్షల ట్రాకింగ్ అండ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అద్భుత ఫలితాలను ఇస్తోంది. గత ఆరు నెలల్లోనే సుమారు 8.45 లక్షలకు పైగా పాదరక్షల లావాదేవీలను ఈ విధానం ద్వారా సమర్థవంతంగా నిర్వహించారు. భక్తులు తమ పాదరక్షలను భద్రపరుచుకోవడంలో గతంలో ఎదుర్కొన్న గందరగోళానికి ఈ ఆధునిక సాంకేతికత చెక్ పెట్టింది. 2025 సెప్టెంబర్ నుండి 2026 ఫిబ్రవరి 15 వరకు ఈ స్మార్ట్ విధానం ద్వారా మొత్తం 4,24,047 పాదరక్షలను భక్తులు దర్శనానికి వెళ్తూ భద్ర పరుచుకోగా.. అందులో లిలి4,21,769 జతలనులిలి అత్యంత సురక్షితంగా తిరిగి అందజేశారు. అంటే సేకరించిన వాటిలో దాదాపు 99 శాతం విజయవంతంగా పంపిణీ కావడం ఈ వ్యవస్థ పనితీరుకు అద్దం పడుతోంది. కేవలం ఫిబ్రవరి మొదటి 15 రోజుల్లోనే 1.35 లక్షల లావాదేవీలు జరగడం ఈ వ్యవస్థ పట్ల భక్తులకున్న నమ్మకాన్ని తెలియజేస్తోంది. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో పీఏసీ-5 కేంద్రం అత్యధికంగా 1.38 లక్షల పాదరక్షల నిర్వహణతో అగ్రస్థానంలో నిలిచింది. రామ్ భగీచా వద్ద 76,556, కృష్ణ తేజ సర్కిల్ వద్ద 56,019, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం వద్ద 55,238, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద 53,250, ఏటీజీహెచ్ వద్ద 44,714 జతల చెప్పులను భక్తులకు సురక్షితంగా అందచేశారు. పై కేంద్రాల్లో పాదరక్షలు తప్పిపోయే అవకాశం లేకుండా టెక్నాలజీ సాయంతో భక్తులకు వేగంగా సేవలు అందుతున్నాయి. గతంలో రద్దీ ప్రాంతాల్లో పాదరక్షలు అస్తవ్యస్తంగా పడి ఉండటం వల్ల భక్తులు పడే ఇబ్బందులను గమనించిన టీటీడీ అదనపు ఈవో శ్రీ సి. హెచ్.వెంకయ్య చౌదరి ఈ వినూత్న పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సహకారంతో, డిప్యూటీ ఈవో శ్రీ సోమన్నారాయణ పర్యవేక్షణలో ఈ ప్రాజెక్ట్ భక్తులకు చేరువైంది. భక్తుల నుంచి ఈ విధానంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండటంతో, త్వరలో కల్యాణకట్ట, బేడి ఆంజనేయస్వామి ఆలయం, ఏటీసీ సర్కిల్ వద్ద మరో మూడు నూతన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారుశ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధులు అత్యంత పవిత్రమైనవని, అక్కడ నిత్యం స్వామి వారు విహరిస్తుంటారు కాబట్టి పాదరక్షలు ధరించడం నిషిద్ధమని టీటీడీ గుర్తు చేసింది. భక్తులు తమ పాదరక్షలను నిర్ణీత కౌంటర్లలో ఈ స్మార్ట్ పద్ధతి ద్వారా డిపాజిట్ చేసి, దర్శనం అనంతరం సులభంగా పొందాలని కోరింది. ఈ 'స్మార్ట్ షూ కీపింగ్' విధానం తిరుమలలో పరిశుభ్రతను పెంచడమే కాకుండా, సామాన్య భక్తులకు ఆహ్లాదకరమైన దర్శన అనుభూతిని కలిగిస్తోంది.

## మున్సిపల్ పోరు కు రెడీ

**ఒంగోలు, ఫిబ్రవరి 19, (పెన్ పవర్ :** కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగుదేశం పార్టీ అధినేత స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ రెండేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో విజయం సాధించడంతో ఇక కూటమి ప్రభుత్వం కూడా లోకల్ బాడీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించడంలో ఎలాంటి సందేహాలు లేవన్నది నాయకత్వానికి స్పష్టమయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండటం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అవుతుండటంతో ఇక కూటమి ప్రభుత్వం కూడా త్వరలోనే దీనికి సంబంధించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలున్నాయి. అయితే ఎండల సమయంలో కంటే తర్వాత పోలింగ్ జరపడం మంచిదని భావిస్తున్నట్లు సమాచారం. ఎండాకాలంలో ఓటింగ్ శాతం పై ప్రభావం పడుతుందని, అలాగే కొన్ని ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశముందన్న అంచనాలో ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికి సంబంధించి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. జులై నెలలో అయితే కొంత ఎండల తీవ్రత తగ్గుతుందని భావిస్తున్నారు. లేదంటే ఆగస్టులోనైనా స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి ప్రభుత్వం సిద్ధమన్న సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామికంగా ఎన్నికలు జరగకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చింది. మున్సిపాలిటీల్లోనూ తాడిపత్రి ఒక్కటే టీడీపీ గెలుచుకుంది. ఈ సారి అలా కాకుండా హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ ను స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించే ప్లాన్ ను చంద్రబాబు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ముందుగా జిల్లాల పర్యటనలు కూడా ఆయన చేస్తారని తెలిసింది. స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగితే తమ ఓటు బ్యాంకు మరింత బలపడుతుందని, రాజకీయంగా తమకు లాభిస్తుందని చంద్రబాబు అంచనా. అనేక మందికి పదవులు దక్కుతాయి. ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని నిరాశలో ఉన్న వారి అసంతృప్తిని చల్లారవచ్చు. మరొకవైపు శాసనసభ్యులను కూడా యాక్టివ్ చేయవచ్చు. వారి నియోజకవర్గంలో జరిగే పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గెలిపించుకునే బాధ్యత వారిపైనే ఉండటంతో వారు నిరంతరం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. దానివల్ల ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత ఏర్పడుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే వీలయినంత త్వరగానే స్థానిక సంస్థలకు వెళ్లేలా చంద్రబాబు రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# అర్ధం కాని పవన్ వ్యూహం



**కాకినాడ, ఫిబ్రవరి 19, పెన్ పవర్ :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి తన గ్రాఫ్ తగ్గించుకుంటున్నట్లే కనపడుతుంది. ప్రశ్నించాలని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ ఆయన ప్రశ్నించడమే మానేశారని సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం జగన్ ఓటమి కోసమే పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారా? లేక ఆయన ముఖ్యమంత్రి కావడానికి వచ్చారా? అని జనసైనికులే ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ పవన్ కళ్యాణ్ పై ఇంతకు ముందు ఫైర్ కనిపించడం లేదని పోస్టు చేస్తున్న వీడియోలు ఇందుకు నిదర్శనం. పార్టీ నేతల నుంచి అభిమానుల వరకూ పవన్ కళ్యాణ్ వ్యూహం ఎవరికీ అర్థం కాకుండా ఉంది. మరొకవైపు జగన్ ను ఓడించాలంటే మనం సీట్లు త్యాగం చేయాల్సిందేనని ఇప్పటి నుంచే చెబుతున్న హితోక్తులు కూడా వారిని కలవరపెడుతున్నాయి. జగన్ ను ఓడించడానికి అయితే రాజకీయాల్లోకి రావడం ఎందుకన్న ప్రశ్న కాపు సామాజికవర్గం నుంచి వస్తుంది. తొలిసారి కాపు సామాజికవర్గం నుంచి ఒక వ్యక్తి ముఖ్యమంత్రి అయితే చూడాలనుకున్నామని, కానీ పవన్ కళ్యాణ్ మాటలను చూస్తుంటే ఆయన ఎప్పటికీ సీఎం పదవి కోరుకోవడం లేదని అర్థమవుతుందన్న అభిప్రాయం ఎక్కువ మందిలో వినిపిస్తుంది. మరొకవైపు కాపు సామాజికవర్గం సమస్యలపై కూడా ఆయన మాట్లాడకపోవడాన్ని వారు తప్పుపడుతున్నారు. కాపు రిజ్వేషన్లు అమలు చేయించడం, కాపు కార్పొరేషన్ కు నిధులు కేటాయించి పేదలైన కాపు కుటుంబాలను ఆదుకునే పనికి కూడా పవన్ కళ్యాణ్ చేపట్టడం లేదన్న విమర్శలున్నాయిఈ నేపథ్యంలో క్రమేపీ పవన్ కళ్యాణ్ గ్రాఫ్ ఇటు కాపు సామాజికవర్గంలోనూ అటు పార్టీ క్యాడర్ లోనూ పోతుంది. మరొకవైపు ఆయన సినీ అభిమానులు మాత్రం చెక్కు చెదరకుండా ఉన్నారు. నియోజకవర్గాల్లో తమకు విలువ లేకుండా చేస్తున్నారని చెప్పినా పవన్ వినిపించుకోవడం లేదని, తాము తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని జనసేన ద్వితీయ శ్రేణి నేతలు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జనసేనలో చాలా మంది సైలెంట్ అయ్యారు. పవన్ కళ్యాణ్ వ్యూహం తమకు అర్థమయిందని, కేవలం జగన్ ఓడించడానికి మాత్రమే రాజకీయాల్లోకి వచ్చారని, తాను ముఖ్యమంత్రి కావడానికి రాలేదన్నది స్పష్టంగా కనిపిస్తుందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. కానీ పవన్ కళ్యాణ్ ను అభిమానించే వారు మాత్రం ఆయన ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశ్యంతోనే అనుభజ్ఞుడైన చంద్రబాబుకు మద్దతిస్తున్నారని, అందుకే తగ్గుతున్నారని అంటున్నారు.

# వైసీపీ సెల్ఫ్ గోల్



**నెల్లూరు, ఫిబ్రవరి 19,పెన్ పవర్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు కొత్తేమీ కాదు. కానీ, ఆధారాలు లేకుండా చేసే విమర్శలు ఒక్కోసారి బూమరాంగ్ అయి ఎదుటిపక్షానికి ఆయుధంగా మారుతుంటాయి. తాజాగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీలంక పర్యటన విషయంలో వైసీపీ చేసిన ఆరోపణలు ఇప్పుడు ఆ పార్టీకే ఇబ్బందికరంగా మారాయి. వ్యక్తిగత పర్యటనను ప్రభుత్వ ఖర్చుగా చిత్రీకరించే ప్రయత్నం చేయబోయి, వైసీపీ మరోసారి రాజకీయంగా 'సెల్ఫ్ గోల్' వేసుకుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారత్ -- పాకిస్థాన్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు నారా లోకేశ్ శ్రీలంక వెళ్లారు. దీనిపై వైసీపీ సోషల్ మీడియా వింగ్, ఆ పార్టీ అనుబంధ మీడియా సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారాన్ని మొదలుపెట్టాయి. మంత్రి హోదాలో ఉన్న లోకేశ్, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ విదేశాల్లో విలాసాలు చేస్తున్నారని, విమాన ప్రయాణాల నుండి మ్యాచ్ టికెట్ల వరకు అన్నీ ప్రభుత్వ ఖజానా నుంచే చెల్లించారని ఆరోపించారు. గతంలో ఆయన విదేశీ పర్యటనలపై చేసిన విమర్శలనే ఇప్పుడు కూడా కొనసాగించే ప్రయత్నం చేశారు. వైసీపీ ఆరోపణలపై లోకేశ్ తనదైన శైలిలో స్పందించారు. కేవలం ఖండించడమే కాకుండా, నేరుగా వైఎస్ జగన్‌ను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "ఫ్లైట్ టికెట్టూ నాదే.. మ్యాచ్ టికెట్టూ నాదే.. నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా?" అంటూ రాయలసీమ యాసలో ఆయన ఇచ్చిన కౌంటర్ నెట్టింట వైరల్ అయ్యింది. తన వ్యక్తిగత పర్యటనలకు సంబంధించిన ఖర్చులను తనే భరించుకున్నానని, ఇందులో ప్రభుత్వానికి కానీ, ప్రజలకు కానీ సంబంధం లేదని స్పష్టం చేశారు. ఒక మంత్రిగా తన వ్యక్తిగత సమయాన్ని గడిపే హక్కు తనకు ఉందని, దానికి కూడా రాజకీయ రంగు పూయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. కేవలం లోకేశ్ వ్యక్తిగత స్పందనకే పరిమితం కాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ విషయంలో అధికారికంగా 'ఫ్యాక్ట్ చెక్' విడుదల చేసింది. లోకేశ్ శ్రీలంక పర్యటన కోసం ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదని స్పష్టం చేసింది. సాధారణంగా మంత్రులు విదేశాలకు వెళ్లేటప్పుడు అనుసరించాల్సిన ప్రోటోకాల్, భద్రతాపరమైన అనుమతులు తప్ప, ఆర్థికంగా ఎటువంటి భారమూ ప్రభుత్వంపై పడలేదని ఆధారాలతో సహా వివరించింది. గతంలో కూడా లోకేశ్ విదేశీ పర్యటనలపై ఇలాంటి ఆరోపణలే చేసింది వైసీపీ. అప్పట్లో ఆయన పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లినా, వ్యక్తిగత పర్యటనలని ప్రచారం చేసింది. అయితే, ఇప్పుడు పరిస్థితి మారింది. కేవలం బురదజల్లే ఉద్దేశంతో చేసే ఆరోపణలు ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోతున్నాయి. ప్రతి చిన్న విషయాన్ని వివాదం చేయడం వల్ల ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. వైసీపీ ఆరోపణలు చేసిన వెంటనే, కూటమి మద్దతుదారులు పాత రికార్డులను, ఖర్చుల వివరాలను బయటపెడుతుండటంతో వైసీపీ సోషల్ మీడియా వింగ్ డిఫెన్స్‌లో పడిపోతోంది. రాజకీయాల్లో విమర్శలు ప్రతిపక్షాల హక్కు. కానీ, ఆ విమర్శలు వాస్తవాలకు దగ్గరగా ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది. లోకేశ్ క్రికెట్ మ్యాచ్ పర్యటనపై వైసీపీ చేసిన రగడ, చివరికి ఆయన వ్యక్తిగత స్వేచ్ఛను ప్రశ్నించినట్లుగా మారి, ప్రజల్లో వైసీపీపై ప్రతికూలత పెరిగేలా చేసింది. తప్పుడు ప్రచారాలతో ప్రత్యర్థిని ఇరుకున పెట్టాలనుకున్న వైసీపీ, తానే బొక్కబోర్లా పడటం ఈ ఎపిసోడ్ ద్వారా మరోసారి స్పష్టమైంది.

# కలెక్షన్ కింగ్ అరెస్ట్ కు రంగం సిద్ధం

**తిరుపతి, ఫిబ్రవరి 19 (పెన్ పవర్ :** కొంతకాలంగా సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా లో మోహన్ బాబు యూనివర్సిటీ) గురించి వస్తున్న కథనాలు మొత్తం మనం చూస్తూనే ఉన్నాం. విద్యార్థుల వద్ద ఇష్టమొచ్చినట్టు డబ్బులు వసూలు చేస్తున్నారని, అలా అక్రమంగా పాతిక కోట్ల రూపాయిల వరకు వసూలు చేశారని, ఆ డబ్బులు మొత్తం తిరిగి విద్యార్థులకు ఇచ్చేయాలంటూ ప్రభుత్వం సైతం ఆర్డర్లు ఇవ్వడం, మోహన్ బాబు యూనివర్సిటీ నుండి ఎలాంటి రెస్పాన్స్ రాకపోవడం, విద్యార్థులు ప్రతీ రోజు ధర్నాలు చేయడం, విద్యార్థి సంఘాలు కూడా మద్దతుగా నిల్చి మోహన్ బాబు యూనివర్సిటీ ఎదుట నిరసన కార్యక్రమాలు చేయడం, ఇలా చాలానే గడిచిన కొద్దిరోజుల నుండి జరుగుతూనే ఉన్నాయి. అయితే విద్యార్థి సంఘాల నాయకులను మోహన్ బాబు బౌన్సర్లు కిడ్నాప్ చేసి, అతని ఫార్మ్ హౌస్ లో దాచారని , అందుకు సంబంధించిన విజువల్స్ తో సహా కోర్టు కి సమర్పించారు. మోహన్ బాబు తనకు అరెస్ట్ నుండి రక్షణ కల్పించాలని గత కొంతకాలం క్రితం హై కోర్టు కి అప్పీల్ చేసుకున్నాడు. నేడు మోహన్ బాబు అప్పీల్ ని హై కోర్టు విచారించి, ఆయన రిక్వెస్ట్ ని తిరస్కరించింది. అంతే కాకుండా ఫోన్ కాల్స్, మెసేజ్లపై ఫోరెన్సిక్ రిపోర్టు అవకాశమని పేర్కొంటూ విచారణను మార్చి 3 కి వాయిదా వేసింది. అయితే హై కోర్టు ముందస్తు బైలు నిరాకరించడంతో పోలీసులు ఈ కేసు విషయం లో ఒకవేళ మోహన్ బాబు ని విచారణ కోసం రిమాండ్ కి తీసుకెళ్లినా అడిగేవాళ్ళు ఉండరంటూ సోషల్ మీడియా లో విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. క్రమశిక్షణ కు మారుపేరుగా పేరొందిన మోహన్ బాబు, ఇలా రిమాండ్ కి వస్తే రావాల్సి వస్తే ఆయన మనసు చాలా నొచ్చుకునే అవకాశం ఉందని అంటున్నారు విశ్లేషకులు. అయితే ఆయన విచారణ కి అందుబాటులో ఉంటాడా లేదా అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. ఇదంతా పక్కన పెడితే చాలా కాలం తర్వాత మోహన్ బాబు మళ్లీ సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇస్తూ చేస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. నేచురల్ స్టార్ నాని హీరో గా నటిస్తున్న ఈ చిత్రం లో మోహన్ బాబు నాని కి తండ్రి పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల అవ్వగా, ఆడియన్స్ నుండి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం తో పాటు అజయ్ భూపతి దర్శకత్వం లో రమేష్ బాబు తనయుడు జయ కృష్ణ , మరియు రాషా తండాని హీరో హీరోయిన్లు గా నటిస్తున్న 'శ్రీనివాస మంగపురం' చిత్రం లో కూడా మోహన్ బాబు కీలక పాత్ర పోషిస్తున్నాడు.

## ఇంత కంటే అవమానం ఉండదు: పసికూన ముందు పరువు పోగొట్టుకున్న పాకిస్తాన్, ఆస్ట్రేలియా..!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో ఇటలీ పోరాటం ముగిసింది. ఈ పసికూన జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. తొలిసారి మెగా టోర్నీ ఆడిన ఇటలీ అంచనాలకు మించి రాణించింది. ఫస్ట్ టైమ్ వరల్డ్ కప్ ఆడుతున్నామనే టెన్షన్ లేకుండా బలమైన జట్లపై మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. అంతేకాకుండా ఒక విషయంలో ఇటలీ మాజీ చాంపియన్లు పాకిస్తాన్, ఆస్ట్రేలియా కంటే మెరుగ్గా ఉంది.

అదే గ్రూప్ దశలో అత్యధిక సిక్సర్లు కొట్టడం. గ్రూప్ దశలో భాగంగా నాలుగు మ్యాచులు ఆడిన ఇటలీ మొత్తం 34 సిక్సర్లు కొట్టింది. గ్రూప్ దశలో అత్యధిక సిక్సర్లు బాదిన జాబితాలో ఇటాలియన్ టీమ్ నాలుగో స్థానంలో నిలిచింది. ఇదే సమయంలో పాకిస్థాన్ 28, ఆస్ట్రేలియా 14 సిక్సర్లతో ఇటలీ కంటే వెనుకంజలో ఉండటం గమనార్హం.ఈ జాబితాలో 40 సిక్సర్లతో టీమిండియా అగ్రస్థానంలో నిలిచింది. 33 సిక్సర్లతో మరో పసికూన అమెరికా ఈ జాబితాలో నాలుగో స్థానంలో నిలవడం విశేషం. మాజీ ప్రపంచ విజేతలైనా ఆస్ట్రేలియా, పాకిస్తాన్ పసికూనలు ఇటలీ, అమెరికా కంటే తక్కువ సిక్సర్లు కొట్టడంపై క్రికెట్ ఫ్యాన్స్ సెటైర్లు వేస్తున్నారు. ఇంత కంటే అవమానం మరొకటి ఉండదని.. పసికూనలు ముందు పాకిస్తాన్, ఆస్ట్రేలియా పరువు పోగొట్టుకున్నాయని కామెంట్స్ చేస్తున్నారు. చెత్త ప్రదర్శనతో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా ఈ వరల్డ్ కప్?లో గ్రూప్ దశనలోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే.

**ఐసీసీ 2026 టీ20 వరల్డ్ కప్ గ్రూప్ దశలో ఎక్కువ సిక్సులు కొట్టిన జట్లు:**

భారతదేశం – 40 సిక్సులు
ఇంగ్లాండ్ – 36 సిక్సులు
వెస్టిండీస్ – 36 సిక్సులు
ఇటలీ – 34 సిక్సులు
యూఎస్ఏ – 33 సిక్సులు

# సూపర్--8కి భారత్ జట్టులో మార్పులు?.. ప్లేయర్లకు సునీల్ గవాస్కర్ కీలక సూచనలు





**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా జరిగే సూపర్--8 దశలోకి భారత జట్టు అడుగుపెట్టింది. ఫిబ్రవరి 22వ తేదీన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో తొలి సూపర్--8 మ్యాచ్‌లో టీమిండియా తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు భారత ప్లేయింగ్ ఎలెవన్‌పై పెద్ద ఎత్తున చర్చలు కొనసాగుతున్నాయి. జట్టులో మార్పుపై మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ మాత్రం టీమ్‌లో కేవలం ఒకే ఒక్క మార్పు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రెస్ట్ తీసుకున్న అక్షర్ పటేల్ సూపర్--8 మ్యాచ్‌లో తప్పకుండా తుది జట్టులోకి వస్తాడు అని ధీమా వ్యక్తం చేశాడు. అతని కోసంఅర్ష్‌దీప్ సింగ్ ని బెంచ్‌కు పరిమితం చేసే ఛాన్స్ ఉందని పేర్కొన్నాడు. ఇటీవల నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలిసారి వరల్డ్ కప్‌లో ఆడిన వాషింగ్టన్ సుందర్ నాలుగు ఓవర్లలో వికెట్ తీయకపోయినా, లోయర్ ఆర్డర్ లో బ్యాటింగ్ అవసరం కాబట్టి, అతడికి మరో అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయని సునీల్ గవాస్కర్ తెలిపారు. అహ్మదాబాద్ పిచ్ స్పిన్‌కు పెద్దగా సహకరించదనే కారణంతో కుల్దీప్ యాదవ్ కు ఈ మ్యాచ్‌లో కూడా ఛాన్స్ దక్కకపోవచ్చని పేర్కొన్నారు. గతంలో సౌతాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లలో కూడా కుల్దీప్ ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేదని సన్నీ గుర్తు చేశారు. వాషింగ్టన్ సుందర్ 8వ స్థానంలో కూడా బ్యాటింగ్ చేయగలడు.. బంతిని బౌండరీకి తరలించే సామర్థ్యం అతడికి ఉంది.. అదే వాషికి ప్లస్ పాయింట్.. కాబట్టి అర్షదీప్ స్థానంలో అక్షర్ రావడం ఒక్కటే మార్పుగా నేను భావిస్తున్నాను అని మాజీ క్రికెటర్ గవాస్కర్ స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా, వరుసగా మూడు సార్లు డకౌట్స్ తో తీవ్రంగా నిరాశపరిచిన అభిషేక్ శర్మకు కీలక సూచనలు చేశాడు. భారీ షాట్లు కొట్టాలనే ఒత్తిడిని తగ్గించుకుని, ఎక్కువ సేపు క్రీజ్‌లో ఉండేందుకు ప్రయత్నం చేయాలని తెలిపాడు. ఫస్ట్ బాల్ నుంచే సిక్స్ లేదా ఫోర్ కొట్టాలని ప్రయత్నించాల్సిన అవసరం లేదన్నాడు.. ఒక సింగిల్ తీసుకుని ఖాతా తెరవాలి.. నాలుగు డాట్ బాల్స్ వచ్చినా పరవాలేదు.. ఆ తర్వాత వాటిని డాట్ అయినా బాల్స్ ని కవర్ చేయగల సత్తా అభిషేక్ కి ఉందని సన్నీ వెల్లడించారు. సూపర్--8 దశలో ప్రతి మ్యాచ్ కీలకం కావడంతో.. భారత్ తీసుకునే నిర్ణయాలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దక్షిణాఫ్రికాతో జరిగే ఈ మ్యాచ్‌లో టీమిండియా ఏ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతుందో వేచి చూడాలి..

# శ్రీలంక జట్టును చిత్తు చేసిన పసికూన జింబాబ్వే..






**హైదరాబాద్ పెన్ పవర్:** 20 ప్రపంచ కప్ 2026 గ్రూప్--దీలో భాగంగా కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్ లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. 6 వికెట్ల తేడాతో సికందర్ రజా సేన గ్రాండ్ విక్టరీ సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. లంక బ్యాటర్లలో పాతుమ్ నిస్సాంక (62) ఒక్కడే హాఫ్ సెంచరీ చేయగా.. చివర్లో జట్టు భారీ స్కోర్ సాధించడంలో పవన్ రత్నాయకే (44) కీలక ఇన్నింగ్ ఆడాడు. కుశాల్ పెరీరా (22) ఫర్వాలేదనిపించిన మిగతా బ్యాటర్లు అందరు దారుణంగా విఫలమయ్యారు. శ్రీలంక జట్టులోని మిగతా బ్యాటర్లు కుశాల్ మెండిస్ (14) కమిందు మెండిస్ (7), కెప్టెన్ దాసున్ షనకా (6), దుషన్ హేమంత (0) క్రీజులోకి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. చివరి ఓవర్ లో దునిత్ వెల్లలాగే రెండు ఫోర్లు కొట్టడంతో శ్రీలంక 7 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేయగలిగింది. దీంతో జింబాబ్వే బౌలర్లలో గ్రేమ్ క్రీమర్, బ్లెస్సింగ్ ముజారబానీ, బ్రాడ్ ఎవాన్స్ తలో రెండు వికెట్లు పడగొట్టగా, ర్యాన్ బర్ల్ ఒక వికెట్ తీసుకున్నాడు. లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన జింబాబ్వే జట్టు ప్రారంభం నుంచే లంక బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. జింబాబ్వే ఓపెనర్లు తాడివానాషే మారుమణి, బ్రియాన్ బెన్నెట్ దుకుడుగా బ్యాటింగ్ చేయడంతో టార్గెట్ తగ్గిపోయింది. 69 పరుగుల వద్ద తడివానాషే మరుమాని (34) మొదటి వికెట్ గా డగౌట్ కి వెళ్లిన తర్వాత మైదానంలోకి వచ్చిన ర్యాన్ బర్ల్ సైతం 12 బంతుల్లో 23 పరుగులు చేసి 98 పరుగుల దగ్గర ఔట్ అయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సికందర్ రాజా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. జస్ట్ 26 బంతుల్లోనే 2 ఫోర్లు, 4 సిక్సులతో 45 పరుగులు చేసి దుషన్ హేమంత బౌలింగ్ లో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో దాసున్ షనకాకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. ఆ తర్వా బ్యాటింగ్ కి వచ్చిన తషింగా ముసేకివా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేక ఔట్ అయ్యాడు. మరో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ మిడిల్ ఆర్డర్ లో బ్యాటింగ్ కి వచ్చిన టోనీ మున్యోంగా కలిసి జట్టును గెలిపించాడు.

# టైర్ 2 హీరోల్లో బోర్డర్ దాటేసింది వీరే!



**కుశిత కల్లపు గ్రేస్‌ఫుల్ గ్లామ్‌లో మెరుస్తుంది**



పాన్ ఇండియా సినిమాల ప్రభావం మొదలైన దగ్గరి నుంచి టాలీవుడ్ హీరోల్లో అత్యధిక శాతం మందిని ఓ ప్రశ్న వెంటాడుతోంది. అదే వంద కోట్ల క్లబ్‌లో చేరే సినిమా ఎప్పుడని. చిన్న చిన్న హీరోలు సైతం తమ సినిమాలతో వంద కోట్ల మార్కుని దాటేస్తుంటే వారి కంటే ముందు ఇండస్ట్రీలోకి ప్రవేశించిన హీరోలు ఆ మార్కుని..ఆ బోర్డర్‌ని దాటేయలేకపోతున్నారు. ఒక్కటంటే ఒక్క సినిమా అయినా పడుతుందా? దాంతో ఆ బోర్డర్‌ని దాటేయలేకపోతామా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**ఈ బోర్డర్‌ని ముందు దాటేసిన హీరో...**

ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద వంద కోట్ల మార్కు బోర్డర్‌ని చాలా సింపుల్‌గా దాటేసి దానికి మించిన వసూళ్లని రాబోయే సినిమాలతో సాధించాలని కొంత మంది హీరోలు ఆశగా అడుగులు వేస్తున్నారు. టైర్ 2 హీరోల్లో ఈ బోర్డర్‌ని ముందు దాటేసిన హీరో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ. పరశురామ్ డైరెక్ట్ చేసిన –గీత గోవిందం– సినిమాతో వంద కోట్ల క్లబ్‌లో చేరిన విషయం తెలిసిందే. బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.132 కోట్లు వసూలు చేసి ఫస్ట్ టైమ్ రౌడీ సత్తా ఏంటో చూపించింది.అప్పటి నుంచి మళ్లీ వంద కోట్లు రాబట్టే సినిమా కోసం శ్రమిస్తున్నా విజయ్‌కి వర్కవుట్ కావడం లేదు. ఆ తరువాత రేసులో నిలిచింది మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్. హీరోగా పరిచయమైన ఫస్ట్ మూవీ –ఉప్పెన–. బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మూవీ బ్లాక్ బస్టర్ టాక్‌తో వంద కోట్ల మార్కుని చేరింది. దానికి మించి వైష్ణవ్ తేజ్ ట్రై చేస్తున్నా ఫ్లాపులే ఎదురవుతున్నాయి. తన తరువాత మూడు సినిమాలతో రేసులో ముందు వరుసలో నిలిచిన హీరో నేచురల్ స్టార్ నాని. –దసరా– మూవీతో ఫస్ట్ టైమ్ వంద కోట్ల క్లబ్‌లో చేరిన నాని ఆ తరువాత –సరిపోదా శనివారం, హిట్ 3లతో బ్యాక్ టు బ్యాక్ వంద కోట్లకు మించి వసూళ్లని రాబట్టిన హీరో అనిపించుకున్నాడు.ఈ రేసులో నిఖిల్ కూడా చేరాడు. తను నటించిన మిస్టరీ యాక్షన్ అడ్వెంచర్ –కార్తికేయ 2–తో ఈ ఫీట్‌ని అందుకున్నాడు. ఈ మూవీ రూ.120 కోట్లకు పైనే రాబట్టింది. మాస్ మహారాజా రవితేజ కూడా –ధమాకా– మూవీతో ఈ క్లబ్‌లో చేరాడు. యాక్షన్ కామెడీ డ్రామాగా త్రినాథరావు నక్కిన తెరకెక్కించిన ఈ మూవీ రూ.110 కోట్లు రాబట్టింది. స్టార్‌బాయ్ సిద్ధూ జొన్నలగడ్డ –టిల్లూ స్క్వేర్–తో ఆ ఫీట్‌ని పూర్తి చేశాడు. త సినిమా రూ. 135 కోట్ల వసూళ్లని అందించింది. నాగచైతన్య కూడా నేను సైతం అన్నట్టుగా –తండేల్–తో రూ.100 కోట్లు రాబట్టి ఈ క్లబ్‌లో స్థానం దక్కించుకున్నాడు.

**రేసులో లేని హీరో ఖాతాలో రెండు...**

చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీరంగంలో ఎన్నో సినిమాలు చేసిన తేజ సజ్జ –ఓ బేబీ– సినిమాతో యంగ్ యాక్టర్‌గా అందరి దృష్టిని ఆకర్షించాడు. సమంత టైటిల్ పాత్రలో నటించిన ఈ మూవీ సక్సెస్ కావడంతో –జాంబిరెడ్డి–తో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. ఆ తరువాత ఇష్క్, అద్భుతం అంటూ రెండు సినిమాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ప్రశాంత్ వర్మతో కలిసి –హనుమాన్– అంటూ షాక్ ఇచ్చాడు. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ అనిపించుకుని బాక్సాఫీస్ వద్ద రూ.296 కోట్లు రాబట్టి అందరిని ఆశ్చర్యపరిచింది. ఈ మూవీ అందించిన జోష్‌తో కొత్త కథలనే ఎంచుకోవాలన్న నిర్ణయానికి వచ్చిన తేజ –మిరాయ్– అంటూ ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఇది కూడా సక్సెస్ అయి రూ.140 కోట్లకు మించి వసూళ్లని రాబట్టడంతో బ్యాక్ టు బ్యాక్ వంద కోట్లకు మించి వసూళ్లని రాబట్టిన హీరోగా సరికొత్త రికార్డు సాధించాడు. త్వరలో –జై హనుమాన్–తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు.

**వంద కోట్లు దాటని హీరోలు...**

మాస్ మహారాజా రవితేజ నుంచి తేజ సజ్జ వరకు టైర్ 2 హీరోల్లో చాలా వరకు వంద కోట్ల బోర్డర్‌ని దాటేయడంతో ఇప్పుడు మిగిలిన హీరోలపై చర్చ మొదలైంది. ఈ మార్కుని ఇప్పటి వరకు రామ్ పోతినేని, శర్వానంద్, గోపీచంద్, అల్లరి నరేష్, రానా దగ్గుబాటి (సోలో హీరోగా), అడివి శేష్, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సాయి ధరమ్‌తేజ్, వంటి హీరోలున్నాయి. ఈ ఫీట్‌ని సాయి ధరమ్ తేజ్ –విరూపాక్ష– మూవీతో దాటేస్తాడని అనుకున్నారు కానీ ఆ మూవీ రూ.90 కోట్లు మాత్రమే రాబట్టడంతో తను వంద కోట్ల క్లబ్‌లో చేరలేకపోయాడు. మిగిలిన టైర్ 2 హీరోల్లో రామ్ నుంచి రానా వరకు అవకాశం ఉన్న అందుకు తగ్గ సినిమాలు పడటం లేదు. వన్స్ పడితే వంద బోర్డర్ ఈజీగా దాటేస్తారు.



**నువేక్ష తన సహజమైన ఆకర్షణ మరియు స్క్రీన్ ప్రెజెన్స్‌తో స్టన్ చేస్తుంది**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965